Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

Postal regd: GTR/115/2025-27

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

అమరావతి సంపుటి (Vol) : 10 సంచిక (Issue) : 34 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 (Andhra Pradesh Capital's First Telugu Weekly)

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

గురువారం, 4 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI : APTEL/2015/66622 Postal regd: GTR/115/2025-27 స్థాపితం : 2015

## ఎన్నికల సంస్కరణలపై వచ్చే వారంలో చర్చ.. కేంద్రం, విపక్షాల మధ్య కుదిరిన అంగీకారం




**న్యూఢిల్లీ:** పార్లమెంటు శీతాకాల సమావేశాల రెండోరోజైన మంగళవారం కూడా పార్లమెంటులో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'పై విస్తృత చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టంతో తలెత్తిన ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. కేవలం ఎస్ఐఆర్ పైనే కాకుండా ఎన్నికల సంస్కరణలపై విస్తృత చర్చకు తాము సిద్ధంగా ఉన్నట్టు కేంద్రం ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే ఎస్ఐఆర్‌పై వెంటనే చర్చ జరగాలని ఉభయసభల్లోనూ విపక్షాలు పట్టుబడుతున్నాయి. చర్చకు తాము సిద్ధమేనని, అయితే గడువు పెట్టవద్దని విపక్షాలను కేంద్రం కోరింది. బీఏసీలో నిర్ణయించిన ప్రకారం 'వందేమాతరం'పై తొలుత చర్చ జరగాలని, ఆ తర్వాత అన్ని ముఖ్యమైన అంశాలపైనా చర్చించవచ్చని ప్రభుత్వం సూచించింది. ఈనెల 7వ తేదీతో వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నందున దీనిపై తొలుత చర్చించేందుకే తాము ప్రాధాన్యత ఇస్తున్నట్టు వివరించింది.

**ఫ్లోర్ లీడర్లతో సమావేశం**

కాగా, ఫ్లోర్ లీడర్లతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం జరిపారు. వచ్చే వారంలో ఎన్నికల సంస్కరణలపై చర్చ చేపట్టేందుకు కేంద్రం ఈ సమావేశంలో అంగీకరించింది. ఆ ప్రకారం ఈనెల 8వ తేదీ సోమవారంనాడు తొలుత 'వందేమాతరం'పై చర్చ జరుగుతుందని, 9-10 తేదీల్లో ఎన్నికల సంస్కరణలపై చర్చ ఉంటుందని తెలిసింది.

## త్వరలో ఏర్పాటు.. సీఎం చంద్రబాబు కీలక ప్రకటన



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆర్టీసీకి మరో వెయ్యి ఈవీ బస్సులు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఏపీ ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సచివాలయంలో విద్యుదుత్పత్తి, పంపిణీలో వ్యయం తగ్గింపుపై అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'ప్రభుత్వ భవనాలపై విస్తృత స్థాయిలో సౌర విద్యుత్ ప్రాజెక్టులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది ప్రోత్సాహకాలు కొనసాగించాలి. ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఈవీ బస్సులు వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలి. ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులు 60 రోజుల్లో కార్యరూపం దాల్చాలి. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఎంవోయూలు కుదుర్చుకోవాలి. ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంవోయూలు చేసుకోవాలి. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల్లోనూ విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి' అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

**వైసీపీపై విమర్శలు..**

సమీక్షలో సీఎం చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. విద్యుత్ వ్యవస్థపై గత ప్రభుత్వం చేసిన పనులపై ఆయన మాట్లాడారు. 'అసమర్థ నిర్ణయాలతో విద్యుత్ రంగాన్ని గత పాలకులు అస్తవ్యస్థం చేశారు. పీపీఏ రద్దుతో రూ.9 వేల కోట్ల భారాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రజలపై మోపింది. విద్యుత్ వినియోగించకుండానే ప్రజాధనాన్ని కంపెనీలకు చెల్లించింది' అని విమర్శించారు.

**నిధులు విడుదల..**

కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో అభివృద్ధి పనులకు ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.7.92 కోట్ల అదనపు నిధులు విడుదలకు ప్రభుత్వం పరిపాలనా పరమైన ఉత్తర్వులు జారీ చేసింది. రాయలసీమ యూనివర్సిటీలో భవన నిర్మాణాల చెల్లింపులకు నిధులు వెచ్చించాలని సూచించింది. తదుపరి చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఉన్నత విద్యా శాఖను ప్రభుత్వం ఆదేశించింది.

## కూటమిపై అసత్య ఆరోపణలు చేశారో.. ఇక ఊరుకునేది లేదు

### - జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం

**అనంతపుపురం, (రాజధాని వార్తలు):** కూటమి నాయకులపై అసత్య ఆరోపణలు చేయాలని చూస్తే సహించేది లేదని వైసీపీ నాయకులు, జగన్ సొంత పత్రికపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...జగన్ సొంత మీడియా గ్రామాల్లో కక్షలు, కార్పాణ్యాలు రేపుతూ చిచ్చు పెడుతోందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వస్తోందని, ఎలాగైనా ప్రజల్లో ప్రభుత్వాన్ని అబాసు పాలుచేయాలని పత్రికను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు కుటి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో వైసీపీకి చెందిన సైకోలను పెట్టుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మండలంలోని రేగాటిపల్లి. పంచాయతీ ముచ్చురామి గ్రామంలో మామిడిచెట్లు ఎవరో కొట్టి వేస్తే అనవసరంగా జనసేన కార్యకర్తలపై



నిందలు వేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా అవాస్తవాలు రాయడం మానుకోవాలని హెచ్చరించారు.

## శ్రీశైలం టోల్‌గేట్ వద్ద రివాల్వర్ కలకలం.. పోలీసుల విచారణ

**నంద్యాల జిల్లా, (రాజధాని వార్తలు):** శ్రీశైలం టోల్‌గేట్ వద్ద రివాల్వర్ కలకలం రేపుతోంది. దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టగా.. ఓ వ్యక్తి నుంచి 9 ఎంఎం పిస్టల్ ఒకటి బయటపడింది. దీంతో సదరు తుపాకీని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. విచారణ చేపట్టారు. కాగా.. రివాల్వర్ తీసుకు వచ్చిన వ్యక్తిని మధ్యప్రదేశ్ వాసిగా గుర్తించారు శ్రీశైలం ఆలయ అధికారులు. ఆ రాష్ట్రానికి చెందిన సైబర్ క్రైమ్ ఎస్ఐ అని ఆయన పోలీసులకు చెప్పుకున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఈ ఘటనపై విచారణలో భాగంగా.. సదరు వ్యక్తి నుంచి రివాల్వర్ సహా ఐడెంటిటీ కార్డును స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్టు శ్రీశైలం



సీఐ ప్రసాదరావు పేర్కొన్నారు.

## జగన్‌పై ఎమ్మెల్యే ఫైర్.. రూ. వెయ్యి పెంచేందుకు ఆయనకు ఐదేళ్లు పట్టింది



**అనంతపుపురం, (రాజధాని వార్తలు):** ఏడాదిలో నగర రూపురేఖలు మార్చేస్తామని, అందుకు ప్రణాళికను అమలు చేయబోతున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. 38వ డివిజన్‌లోని విద్యారణ్య పాఠశాల వద్ద రూ.39 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. అలాగే 27వ డివిజన్‌లో రూ.70 లక్షలతో పూర్తి చేసిన అశోక్‌నగర్ మెయిన్ రోడ్డును శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. కూటమి వచ్చాక నగరంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. గుంతల రోడ్లును బాగు చేస్తూ.. మురుగు కాలవల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఏడాదిలోపు నగర రూపురేఖలు మార్చే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకీర్, ఎంపీడీఓ దివాకర్, మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ నాయుడు, వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ బల్లాపల్లవి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, భావన, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, రాయల్‌మురళి, సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, బీజేపీ నాయకుడు లలిత్‌కు మార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు రమేష్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు భవానీ రవికుమార్, పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వర్, శివ, పవన్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

**విధుల్లోకి తీసుకోవాలని వినతి**

నగర పాలక సంస్థలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను వయో పరిమితి సాకుతో తొలగించడం దారుణమని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం అందజేశారు. అసోసి యేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపాలు, ఉపాధ్యక్షులు సురేషబాబు, వెంకటప్ప, చిరంజీవి, ఓబుళేసు, రాఘవ, గంగాధర్, అంజి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ రీ సర్వే ప్రాజెక్టుకు, గురుకులాలకు నిధులు మంజూరు




**ఇంటర్నెట్ డెస్క్:** భూముల రీసర్వే, గురుకుల పాఠశాలలకు నిధులు మంజూరు చేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది రీ-సర్వే పట్టాదారు పాస్‌పుస్తకాలు, అంబేద్కర్ గురుకులాలకు అదనపు నిధులు విడుదల చేసింది. రైతుల సంక్షేమంతోపాటు విద్యారంగాన్నీ మరింత బలోపేతం చేసే దిశగా ఈ రెండు ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో భూముల రీ-సర్వే ప్రాజెక్టుకు రూ.12 కోట్ల అదనపు నిధుల విడుదలకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ నిధులు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్‌బుక్కుల ముద్రణకు ఉపయోగపడతాయి. ఫేజ్-1 నుంచి ఫేజ్-4 వరకు రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పాస్‌బుక్కులు జారీ చేయ్యనున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్య దర్శిని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే, విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాలకు రూ.39 కోట్ల అదనపు నిధులు మం జూరు చేసింది. పెండింగ్‌లో ఉన్న 135 పనులు.. వీటిలో తరగతి గదులు, హాస్టల్ భవనాల నిర్మాణం, నూతన భవనాల నిర్మాణం మొదలైనవి పూర్తి చేయడానికి ఈ నిధులు వినియోగించనున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. రైతుల ఆస్తి హక్కుల భద్రతకు, గిరిజన-దళిత విద్యార్థుల మెరుగైన విద్యా వసతులకు ఈ రెండు నిర్ణయాలు దోహదపడతాయి.

## డ్రైవర్‌తో గొడవ.. స్కూల్ బస్సుకు నిప్పంటించిన క్లీనర్

**ప్రకాశం జిల్లా, (రాజధాని వార్తలు):** ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. స్కూల్ బస్సుపై క్లీనర్ పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అర్ధవీడు మండలం పాపినేని పల్లిలో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది. మంగళవారం ఉదయం ఆ స్కూల్ బస్సును నడుపుతున్న డ్రైవర్, క్లీనర్ మధ్య ఏదో విషయమై గొడవ జరిగింది. దీంతో క్లీనర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెట్రోల్ తీసుకొచ్చి బస్సుపై వేసి నిప్పంటించాడు. దీంతో బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయింది. అప్పటికింకా పిల్లలెవరూ బస్సు ఎక్కకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ నభికి మంటలు అంటుకుని స్వల్పంగా గాయాలయ్యాయి.

అతడిని స్థానికులు వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. పెట్రోల్ పోసి నిప్పంటించిన క్లీనర్ గోపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## పరిశ్రమల సృష్టికర్త చంద్రబాబు

### - అర్హులకు పక్కా గృహాలు మంజూరు చేస్తాం - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అనంతపుపురం, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల సృష్టికర్త అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. రొద్దం మండలంలోని సానిపల్లిలో వృద్ధులు, వికలాంగులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. కియాలాంటి పరిశ్రమలో వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎంఎసఎంఈలతో రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

**ఫిర్యాదుల స్వీకరణ..**

గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామనీ మంత్రి సవిత అన్నారు. సోమవారం రొద్దంలోని వెలుగు కార్యాలయంలో డివిజన్ స్థాయి ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించారు. ప్రజా సమస్యలపై వందలాది మంది తరలి రాగా



మంత్రి ప్రతి ఒక్కరి సమస్య వింటూ సంబంధిత శాఖాధికారులతో సమస్యకు పరిష్కారం చూపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ ఉదయశంకర్ రాజు, ఎంపీడీఓ ఆనంద్ ప్రసాద్, టీడీపీ నాయకులు మాధవ నాయుడు, వెంకటరామి రెడ్డి, వీరాంజనేయులు, హరీష్, పవన్, శ్రీనాథ్‌చౌదరి, అరుణ్‌కుమార్ రెడ్డి, అశ్వత్థనారాయణ, తిరుపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గీత కులాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట - గుంటూరు 1 ఎమ్మెల్యే నజీర్ అహ్మద్









**గుంటూరు, (రాజధాని వార్తలు):** గీత కులాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గుంటూరు 1 ఎమ్మెల్యే మహ్మద్ నజీర్ అహ్మద్ చెప్పారు. రాజకీయ, ఆర్థిక, విద్యా రంగాలలో బీసీల అభ్యున్నతి కోసం తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు పునాదులు వేశారని, అదే స్ఫూర్తితో టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్ బీసీల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని చెప్పారు. గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం నాడు గీత కులాల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విచ్చలవిడిగా దాడులు జరిగాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన అక్కను వేధిస్తున్నారని నిలాదీస్తే అమర్నాథ్ గౌడ్ అనే బాలుడుని సజీవ దహనం చేశారని, జై జగన్ అనేందుకు నిరాకరించిన తెలుగు దేశం బిసి కార్యకర్త తోట చంద్రయ్య కుటుంబాన్ని పాశవికంగా గొంతు కోసి హత్య చేశారని నజీర్ అహ్మద్ గుర్తు చేశారు. బీసీలు ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ.. గీత కులాల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు బిసిల ప్రగతి కోసం అనేక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. స్థానిక సంస్థలలో నాడు బీసీలకు ఎన్టీఆర్ 24 శాతం రిజర్వేషన్స్ కల్పిస్తే చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచారని చెప్పారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ.. గీత కులాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మద్యం షాపులు, బార్ లైసెన్సుల కేటాయింపులో గీత కులాలకు కూటమి ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్స్ కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కల్లుగీత కార్మికులకు ఎక్సయిజ్ శాఖ ఇచ్చే గుర్తింపు కార్డులను ఆన్ లైన్ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, వృత్తి నిర్వహణలో గాయపడిన కార్మికులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, మరణించిన వారికి తక్షణమే ఎక్స్‌గ్రేషియా తక్షణమే చెల్లించాలని గీత కులాల మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. కల్లుగీత కార్పొరేషన్‌ను నీరా కార్పొరేషన్‌తో కలిపి ఏర్పాటు చేసి వృత్తిదారులు వ్యాపారం చేసుకునేందుకు రూ. 1000 కోట్లు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. నీరా, టాడి ఉత్పత్తుల అధ్యాయనానికి ఒక కమిటీని వేసి తెలంగాణా, కేరళ, బీహార్ రాష్ట్రాలలో అమలు జరుపుతున్న తీరును పరిశీలించాలని మహాసభ విజ్ఞప్తి చేసింది. 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ మిగులు భూములలో తాటి, ఈత వనాల పెంపకాన్ని ప్రోత్సాహించారని పేర్కొంది. ఇప్పుడు కూడా ఆ విధంగా కోస్తా ప్రాంతంలో తాటి, రాయలసీమలో ఈత వనాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మహాసభ ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్ర ఈడిగ సంఘం అధ్యక్షులు మేకల వేణుగోపాల్, రాష్ట్ర యాత సంఘం అధ్యక్షులు అంగటి రాము, శ్రీశయన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోడ అప్పారావు, గీత కులాల సంక్షేమ సంఘం నాయకులు కంచర్ల వెంకటేశ్వరరావు, పేరం ఆదివిష్ణు, వీరవల్లి శ్రీనివాస్, వీరమల్లు సూరిబాబు, కంచర్ల కోటయ్య, జంపన సుధాకర్, యేమినీడి లక్ష్మి శైలజ తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు గీత కులాల ప్రతినిధులు గుంటూరు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

# జర్నలిస్టుల సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధంచండి

## - ఏ.పి.ఎం.పి.ఏ.రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరాం యాదవ్ డిమాండ్

**ఏలూరు, (రాజధాని వార్తలు):** గత ప్రభుత్వాల హయాంలో ఉన్న జర్నలిస్టు సంక్షేమ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏ.పి.ఎం.పి.ఏ.) రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీ రామ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా కన్వీనర్ మెరుగు మువ్వల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో శ్రీ రామ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రతి రోజు అనేక జీ.ఓ.లను విడుదల చేస్తున్న ప్రభుత్వం, ప్రజలకు ప్రభుత్వంకు వారధిగా నిలుస్తూ సమాజ శ్రేయోభిలాషులైన జర్నలిస్టుల సంక్షేమంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల భద్రత కోసం ఇవ్వవలసిన అక్రిడేషన్, జర్నలిస్టులో అబద్ధత భావాన్ని పెంచే విధంగా తయారైందని పేర్కొన్నారు. గతంలో



ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న జర్నలిస్టులకు కొత్తగా అక్రిడిటేషన్ ఇవ్వలేకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యంకు నిదర్శనంగా ఉందన్నారు. మీడియా అక్రిడిటేషన్ జీ.ఓ. ఇచ్చిన ఆరు నెలల తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి నేటికి ఇవ్వలేక తీవ్ర ఆలస్యం చేస్తూ ఉండటం వల్ల వర్కింగ్ జర్నలిస్టులు అభద్రతా భావానికి గురి అవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జీవోలో ఉన్న తప్పకుండా సరిచేసి తక్షణమే వర్కింగ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అందరికీ సులభతరంగా అక్రిడేషన్ మంజురు అయ్యే జీవోలు తగు మార్పు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ఉన్న జర్నలిస్టు యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ, సంక్షేమ నిధి తక్షణమే పునరుద్ధదించాలని, జర్నలిస్ట్ హెల్త్ కార్డు పరిమితి రెండు లక్షల నుంచి ఇరవై లక్షలకు పెంచాలని శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాక ఇంటి నిర్మాణానికి తగు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు పెన్షన్స్ సౌకర్యం అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వర్కింగ్ మీడియా ప్రతినిధులకు 15,000 పెన్షన్ సౌకర్యాన్ని కలిగించాలని ఆయన కోరారు. జర్నలిస్టుల మీద, పత్రిక కార్యాలయాల మీద దాడులు జరుగుతున్న నేపధ్యంలో తక్షణమే మీడియా దాడుల నిరోధక కమిటీని ఏర్పాటు చేయాలని వారు కోరారు. డిసెంబర్ 15 లోపల జర్నలిస్ట్ సంక్షేమ పథకాల పునరుద్ధరణపై విధాన ప్రకటన రాకపోతే ఏ.పి.ఎం.పి.ఏ. ఉద్యమ బాట పడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఎం.పి. ఏ.జిల్లా కో. కన్వీనర్‌లు నాగబోయిన పేర్రాజు,ఎం.జీవన్ ప్రసాద్ మరియు సీనియర్ గౌరవ సలహాదారులు దాసరి రామచందర రావు, నాయకులు ఎర్లీ పోస్ట్ ఎడిటర్ మిల్టన్ మరియు నాయకులు సతీష్, పళ్లెం అబ్రహం, చప్పిడి వాసు, దాసరి రామచందర్ రావు, టి.నరేష్,పి. సుధాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# స్నేహపూర్వక పెట్టుబడులకు ఏపీ సరైన గమ్యస్థానం

**- 2 రోజుల పాటు ముంబయిలో జరిగిన 12వ సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025లో పలువురు ఇన్వెస్టర్లతో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి - రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చలనచిత్ర పరిశ్రమను, పర్యాటకాన్ని ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై ఇన్వెస్టర్లకు దిశానిర్దేశం చేసిన మంత్రి కందుల దుర్గేష్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట - చలనచిత్ర నిర్మాణం, పర్యాటక రంగాలలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను, కల్పించే ప్రోత్సాహకాలు, రాయితీలపై ఇన్వెస్టర్లకు స్పష్టత - ప్రపంచ పెట్టుబడిదారులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, పెట్టుబడులకు ఆహ్వానం పలికిన మంత్రి దుర్గేష్ - రాష్ట్రంలో సాహస, ఆధ్యాత్మిక, తీరప్రాంత , ఫిల్మ్ టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామని వివరణ - ముగిసిన మంత్రి కందుల దుర్గేష్ ముంబయి పర్యటన**

**అమరావతి, (రాజధాని వార్తలు):** డిసెంబర్ 1, 2 తేదీల్లో ముంబయిలో జరిగిన ప్రతిష్టాత్మక 12వ సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ – 2025 వేదికగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చలనచిత్ర, పర్యాటక రంగాలను కీలక సాధనాలుగా వినియోగించుకోవాలని రెండో రోజు మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట తమదైన శైలిలో ఇన్వెస్టర్లకు దిశానిర్దేశం చేసి పెట్టుబడులను ఆహ్వానించారు. తీర ప్రాంతాల నుండి సినీ కారిడార్ల వరకు సంబంధించిన అన్ని రంగాలలో భారతదేశ పర్యాటక, సృజనాత్మక ఆర్థికవ్యవస్థలో కొత్త మార్గాన్ని నిర్దేశించిన ఈ సమ్మిట్‌లో ప్రపంచ పెట్టుబడిదారులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని, పెట్టుబడిదారులకు స్నేహపూర్వక గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా చలనచిత్ర నిర్మాణం, పర్యాటక రంగాలలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను, కల్పించే ప్రోత్సాహకాలు, రాయితీలపై ఇన్వెస్టర్లకు స్పష్టతనిచ్చారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను $2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే స్వర్ణాంధ్ర విజన్ @ 2047 ను పంచుకున్నారు. ఈ ప్రణాళికలో కీలకమైన సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ, డీప్ టెక్నాలజీల పాత్రను వివరించారు. ఏపీ టూరిజం కొత్త పాలసీ 2024–29 ద్వారా ఇన్వెస్టర్లకు అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు ప్రత్యేకంగా అక్కడికి వచ్చిన ఇన్వెస్టర్లతో భేటీ అయి వివరించారు. రాష్ట్రంలో సాహస, ఆధ్యాత్మిక, తీరప్రాంత , ఫిల్మ్ టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేయడానికి విశాఖపట్నం, తిరుపతి, గండికోట, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, అరకు లోయలను యాంకర్ హబ్‌లుగా గుర్తించి అభివృద్ధి చేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను వివరించారు.యానిమేషన్, గేమింగ్, వీఎఫ్ఎక్స్ రంగాలలో గ్లోబల్ లీడర్‌గా ఎదగడానికి, ఏఐ, ఎక్స్ ఆర్ టెక్నాలజీలు మరియు క్లౌడ్ మౌలిక సదుపాయాలలో పెట్టుబడి పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను సృజనాత్మక పరిశ్రమల కోసం "ఆంధ్ర వ్యాలీ"గా మారుస్తామని ప్రకటించారు. అదే విధంగా సినిమా షూటింగ్‌ల కోసం అనుమతులను సులభతరం చేసే లక్ష్యంతో కొత్త "సమగ్ర కొత్త ఫిల్మ్ టూరిజం పాలసీ" ని త్వరలో తీసుకురానున్నామని,



ఈ క్రమంలో సినిమా రంగ అభివృద్ధికి పెట్టుబడులు పెట్టి సహకరించాలని కోరారు. రెండో రోజు సమ్మిట్‌లో భాగంగా కూ, బుక్ మై షో ప్రతినిధులు అనిల్ మఖిజా, చిరాగ్ సరైయా, 91 ఫిల్మ్ స్టూడియోస్ వ్యవస్థాపకులు నవీన్ చంద్ర, గగన్ విహార్ స్పేస్ సిటీ మరియు స్పేస్ ఎగ్జిబిషన్ ఫౌండర్ శ్రీకాంత్ కోడెబోయిన, యూఎస్ఏకు చెందిన బ్లూ ఐ సాఫ్ట్ కార్ప్ మరియు బీఈఎస్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో, డెల్లా రిసార్ట్స్, డెల్లా అడ్వెంచర్ పార్క్ (ఎంఓయూ భాగస్వామి) ఫౌండర్ జిమ్మి మిస్త్రీ, ఐలైన్ స్టూడియోస్ డైరెక్టర్ డి. రాకేష్ లతో మంత్రి కందుల దుర్గేష్, ఎండీ ఆమ్రపాలి కాట ప్రత్యేకంగా భేటీ అయి చర్చించారు. అదే విధంగా సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రవి కొట్టార్కర్ సినిమా రంగానికి సంబంధించిన పలు ప్రతిపాదనలు మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఇరువురూ సుదీర్ఘంగా సినిమా రంగం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం త్వరలోనే విజయవాడ వచ్చి కలుస్తామని తెలుపగా మంత్రి దుర్గేష్ ఆయనను ఆహ్వానించారు. రెండు రోజుల సమ్మిట్‌లో పలువురు ప్రతినిధులు ఏపీలో స్టూడియోల నిర్మాణం చేపట్టాలని ఆసక్తి చూపారని, ప్రత్యేకించి వైజాగ్ లో డిజిటల్ స్టూడియోల ఏర్పాటుకు యోచిస్తున్నట్లు తెలిపారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

త్వరలోనే ఆంధ్రప్రదేశ్ సినిమా రంగ ఇండస్ట్రీ అభివృద్ధి చెందుతుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రోజుల ముంబయి పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్న మంత్రి కందుల దుర్గేష్ ఏపీకి బయలుదేరారు.

# పేదల సేవే పరమావధిగా జోరువానలోనూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వర్షంలో తడుస్తూ పేదల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందించిన మంత్రి ఆనం. జోరు వానను సైతం లెక్కచేయకుండా ప్రజాసేవే పరమావధిగా తమ ఇంటి ముందుకొచ్చిన అభిమాన నేతకు జననీరాజనాలు పలికిన ప్రజలు. సంగం మండలం గాంధీ జన సంఘంలో ప్రతి నెల ఒకటో తేదీన పేదల సేవలో ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పింఛన్లు పంపిణీ చేసి, ప్రజల యోగ క్షేమాలు తెలుసుకున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.

# రాపూరు – చిట్వేల్ ఘాట్ రోడ్డులో రెండు ఆర్టీసీ బస్సులు ఢీ, తప్పిన పెను ప్రమాదం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా రాపూరు – చిట్వేల్ ఘాట్ రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. 13వ కిలోమీటరు లోయ వద్ద రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో రెండు బస్సుల్లో 65 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు, రవాణాశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘాట్ రోడ్లో వేగం నియంత్రణపై సూచనలు చేశారు.

# "మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, సౌత్ మోపూర్ గ్రామంలో "రచ్చబండ : ఆనం విజయకుమార్ రెడ్డి










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి వర్యులు, గౌరవ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వ ర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం, నెల్లూరు రూరల్ మండలం, సౌత్ మోపూర్ గ్రామంలో "రచ్చబండ" కార్యక్రమం నిర్వహించి 'ప్రజా ఉద్యమం' సంతకాల సేకరణ కార్యక్రమం సౌత్ మోపూర్ గ్రామ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, సౌత్ మోపూర్ గ్రామ బండ్ల రాజేంద్రప్రసాద్, జాన మస్తా నయ్య, కరీం భాష, సురేష్, మురళి, నాగరాజు, నాని, కిరణ్ కుమార్ రెడ్డి, సతీష్, వెంకటేష్, రామ్ కుమార్ రెడ్డి, గౌతమ్, చెవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎం శివయ్య, షేక్ మస్తాన్, రోకటి సీనయ్య, రంగారావు, విష్ణు, రవి కుమార్, గంపల సుధాకర్, దాచుర్ వెంకటేశ్వర్లు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పి.హెచ్.పిలచే ఐరన్ ర్యాక్‌లు వితరణ అభినందనీయం

## - 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో శనివారం, ఎన్బిటి కాలనీ, అర్బన్ హెల్త్ సెంటర్‌కు రాష్ట్ర పీ.హెచ్.పీ కోశాధికారి, జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ తండ్రి స్వర్గీయ శాఖవరపు వెంకటరమణయ్య 11వ వర్ధంతి సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్‌నకు మూడు ఐరన్ ర్యాక్‌లు బహుకరించడం జరిగి నది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ మాట్లాడుతూ తల్లిదం డ్రులను ఆదర్శంగా తీసుకున్న వాళ్ళు ఉన్నత స్థాయికి ఎదుగు తారని, మనం మన తల్లిదండ్రులను గౌరవిస్తే మన పిల్లలు కూడా మనల్ని గౌరవిస్తారు అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల న్నారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపకుండా ఇంట్లోనే ఉంచుకొని గౌరవించి, ఆదరించి, సమాజానికి ప్రేరణ ఇచ్చేం దుకు నేటి కాలం ముందుకు రావాలని ఆయన కోరారు. వివిధ కారణాలవల్ల వృద్ధులను ఇంటికి దూరంగా పెట్టడం అనేది అనాగరికత అని పేర్కొన్నారు.

# "ప్రభుత్వానికి మా మహిళల తడాఖా చూపిస్తాం" : కాకాణి పూజిత




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జోనల్-4 అధ్యక్షురాలు మొయిళ్ళ గౌరీ తోటపల్లి గూడూరు జెడ్పిటిసి సభ్యులు ఎంబెటి శేషమ్మ పొదలకూరు ఎంపిటిసి సభ్యులు లక్ష్మీ కళ్యాణి దువ్వూరువారిపాళెం సర్పంచ్ కృష్ణవేణమ్మ, వైసిపి జిల్లా అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు లావణ్య, నెల్లూరు నగర మహిళా విభాగం అధ్యక్షురాలు ధనుజా రెడ్డి పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కూటమిపాలనలో మహిళలకు రక్షణ కరువైంది. కూటమి పార్టీలు ఎన్నో హామీలు ఇచ్చి, అమలు చేయకుండా, మహిళలను మోసం చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు అనేక వేధింపులకు దాడులకు గురవుతున్నారు. తమ ప్రాణాన్ని పణంగా పెట్టి, మరో ప్రాణానికి జీవం పోసే మహిళలకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయకపోవడం దౌర్భాగ్యం. సాక్షాత్తు రాష్ట్రానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్య రాణి గారి వద్ద పనిచేస్తున్న అనధికార వ్యక్తిగత సలహాదారుడు సతీష్ కుమార్ ఒంటరి మహిళను వేధించడం బాధాకరం. కోవిడ్‌లో భర్తను కోల్పోయి, ఉద్యోగం కోసం వచ్చిన బాధిత మహిళను డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు, లైంగిక వేధింపులకు గురిచేయడం చూస్తుంటే, అధికార పార్టీకి చెందిన వ్యక్తుల దుర్మార్గాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. సహాయం కోరి వస్తే కూటమి ప్రభుత్వంలో రక్షకులే భక్షకులుగా వ్యవహరిస్తున్నారు. ఇంటి పరువు కోసం పాకులాడుతూ కొందరు మహిళలు మౌనంగా రోధిస్తున్నా, కొందరు మహిళలు వేధిస్తున్నారని బహిరంగంగా మొరపెట్టుకుంటున్నా, కూటమి ప్రభుత్వం న్యాయం చేసే పరిస్థితిలో లేకపోవడం దారుణం. కూటమి పార్టీకి చెందిన వ్యక్తులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ, మహిళలపై అత్యాచారాలు చేస్తుంటే, మొక్కుబడిగా కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం హాస్యాస్పదం.

నిజాన్ని నిర్భయంగా బయటపెడుతూ, బాధిత మహిళకు అండగా నిలిచిన సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తూ, అధికార పార్టీ నాయకుల చేత దాడులు చేయించడం చూస్తుంటే, రాష్ట్రంలో పత్రికలకు స్వేచ్ఛ ఉందా! అనే అనుమానం కలుగుతుంది. కూటమి ప్రభుత్వం ప్రజలకు నిజాలు తెలియకూడదనే ధోరణితో పనిచేస్తుంది. జగనన్న పాలనలో మహిళలను గౌరవించి, పెద్దపీట వేశారు. మహిళల సాధికారత కోసం పనిచేసిన నాయకుడు మా జగనన్న. జగనన్నపాలనలో ప్రతి పథకాన్ని మహిళల పేరిట అందించి, మహిళలను అభివృద్ధి వైపు నడిపారు. జగనన్న మహిళలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారు. జగనన్న పాలనలో మహిళాభివృద్ధి, సంక్షేమం చూసిన మహిళలు, కూటమిపాలనలో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచారాలను చూసి ఆవేదన చెందుతున్నారు. మహిళల భద్రత కోసం దిశా యాప్ తీసుకొని వచ్చి, మహిళలకు ధైర్యాన్ని కల్పించిన వ్యక్తి జగనన్న.

బాధిత మహిళ న్యాయం కోసం పోరాటం చేస్తున్నా, కూటమి పాలకులు తమకేమీ సంబంధం లేనట్లు ప్రవర్తించడం దారుణం. రాష్ట్రంలోని మహిళా శక్తి ఉద్యమిస్తే కూటమి ప్రభుత్వం తట్టుకోలేదు. కూటమి ప్రభుత్వంలో బాధిత మహిళలకు న్యాయం జరిగేంత వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది. మహిళల పట్ల తప్పుగా ప్రవర్తించే వాళ్లు, ఎంతటివారైనా తప్పించుకోలేరన్న భయాన్ని కల్పించాలి. చంద్రబాబు తక్షణమే స్పందించి, పటిష్టమైన చర్యలు చేపట్టి, మహిళలను వేధిస్తున్న కీచకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం.

# ఘనంగా "బాల్య వివాహ ముక్త భారత్"




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్ట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్తంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సామర్ల కోట మండలం మాధవ పట్నం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌లో బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ, ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జి.ఉష, గ్రామ సర్పంచి యమ్ సుగుణమ్మ, యమ్‌పిటిసి జి కృష్ణ అర్జునరావులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపివో ఉష మాట్లా డుతూ నవంబర్ 27, 2024 నుండి "బాల్య వివాహ ముక్త భారత్" అనే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. దేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారం నేరం, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరే కంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని లేదంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 27 నవంబర్ 2025 నుండి 8 మార్చ్ 2026 వరకు 100 రోజుల అవగాహన కార్యక్రమాలును క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించడం జరుగుతుం దన్నారు. బాల్య వివా హాలు జరగకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజ ములో అందరిపైన ఉందన్నారు. ఎవరైనా బాల్య వివాహా లను ప్రోత్సహించిన మరియు సహకరించిన లేదా 18 సంవత్స రాలు అమ్మాయికి నిండకుండా, 21 సంవత్సరాలు పూర్తి కాకుండా అబ్బాయికి వివాహం చేసిన బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం లేదా పోక్సో చట్టం చర్యలు తీసుకుం టామని తెలియజేసారు. బాలల విద్య, భద్రత కోసం ప్రతీ పౌరుడు గళాన్ని వినిపించాలని, బాల్య వివాహ ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇవ్వాలని అన్నారు. అందులో బాగంగానే ఈరోజు జిల్లా లోని అన్ని గ్రామాలలో క్యాండిల్ లైట్ ర్యాలీ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ బి లక్ష్మీ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, సూపర్వైజర్ నళిని, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గర్భి గేమ్‌లో వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వైష్ణవి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 69వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి స్కూల్ గర్భిగేమ్ ఫెడరేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వదలకూరు నందు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించడం జరిగింది.

ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీరంపల్లి మనుబోలు మండలంలోని ఎనిమిదవ తరగతి చదువుతున్న కాంద్రాది వైష్ణవి అండర్ 17 కాల్స్ విభాగంలో నెల్లూరు టీం నందు ఆడి రాష్ట్రస్థాయిలో ఈ టీం మూడవ స్థనాన్ని కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ శ్రీధర్ అండ్ పి రమేష్ ఈ గేములు నిర్వహించారు వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ కాంతారావు మరియు ఉపా ధ్యాయులు విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# గురుకుల పాఠశాలలో పిఎల్ ల్యాబ్ ప్రారంభం



**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండలం ఆదురుపల్లిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు 30 ట్యాబులను సమగ్ర శిక్ష నెల్లూరు వారు అందించడం జరిగింది. ఈ ట్యాబులను 6 నుండి 9 వ తరగతి వరకు విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మరియు గణితం సబ్జెక్టులు సులభంగా నేర్చు కోవడానికి మరియు మరింతగా శిక్షణ పొందేందుకు అందజే యడం జరిగిందని అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు తెలియజేశారు. ఈ పిఎల్ ల్యాబ్‌ను సమగ్ర శిక్ష అకాడమిక్ మోనిటరింగ్ అధికారి సుధీర్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, డిసిఓ ప్రభావతమ్మ, చేజర్ల విద్యాశాఖ అధికారులు డి సి మస్తానయ్య, జి ఇందిర, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులురెడ్డి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## గవర్నర్ల వ్యవస్థపై గందరగోళం..!

'ప్రతి రాష్ట్రానికీ గవర్నర్‌తో కూడిన శాసన వ్యవస్థ ఉండవలెను..' అని రాజ్యాంగ అధికరణ 168 ప్రారంభమవుతుంది. ఆ శాసన వ్యవస్థలో శాసనసభ, శాసన మండలి ఉండవచ్చు లేదా ఒకే శాసనసభ ఉండవచ్చు. అసలు రాష్ట్ర శాసన వ్యవస్థలో గవర్నర్ ఉనికి అనవసరమనేది నా సునిశ్చిత అభిప్రాయం. ప్రజలు ఎన్నుకోని రాజ్యాంగ అధికారి ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడిన శాసనసభలో ఎందుకు భాగంగా ఉండాలి? శాసనసభ లేదా ఉభయ సభల నుద్దేశించి ప్రసంగించడం తదితర లాంఛనప్రాయమైన విధులను రాష్ట్ర శాసన వ్యవస్థలో భాగంగా కాకుండానే నిర్వహించవచ్చు. శాసన వ్యవస్థ సంబంధిత తన విధులను ఇంగ్లాండ్ రాజు ఇలానే నిర్వర్తిస్తారు కదా. శాసన వ్యవస్థలో గవర్నర్ నిర్వర్తించే నిజమైన పాత్ర బిల్లులకు అనుమతి మంజూరు చేయడమే. ఒక బిల్లు చట్టంగా రూపొందే ప్రక్రియను పూర్తి చేయడంలో గవర్నర్ ఆమోదం పొందడమనేది చాలా ముఖ్యమైన విషయం. శాసన వ్యవస్థ రాజ్యాంగ పరిమితులను అతిక్రమించకుండా ఉండేందుకు బిల్లులకు అనుమతి నివ్వడం లేదా తిరస్కరించే అధికారాలను ఒక వ్యక్తికి అప్పగించడమనేది తప్పనిసరి. అధికరణ 216 ఇలా పేర్కొన్నది: 'శాసనసభ, శాసన మండలి ఉన్నచో ఉభయసభలచే ఆమోదింపబడిన బిల్లును గవర్నర్ సమ్మతి కొరకు పంపవలెను. గవర్నర్ సమ్మతించినచో తన సమ్మతిని, సమ్మతించక నిలుపు చేసినచో నిలుపుదలనూ, ఒక వేళ రాష్ట్రపతి సమ్మతికి నివేదించుచున్న యెడల ఆ విషయాన్ని గవర్నర్ ప్రకటించవలెను. సమ్మతిని నిలుపు చేసినచో ఆ బిల్లును శాసనసభకు పునర్విచారణ చేయమని కోరుతూ ఒక సందేశమును పంపవలెను'. ఈ అధికరణ ఇంకా ఇలా పేర్కొంది: 'గవర్నర్ సందేశానుసారం రాష్ట్ర శాసనసభ మరొకసారి చర్చను జరిపి గవర్నర్ సూచించిన మార్పులను అంగీకరిస్తే బిల్లులో వాటిని చేర్చి, గవర్నర్ సందేశాన్ని తిరస్కరించిన యెడల ఆ బిల్లును యథాతథంగా రాష్ట్ర శాసన సభ గవర్నర్‌కు తిరిగి బిల్లును పంపిన దానికి గవర్నర్ విధిగా సమ్మతిని ఇవ్వవలెను'. ఇది శాసన వ్యవస్థపై ఆరోగ్యకరమైన నియంత్రణ. అంతేగాని శాసననిర్మాణ ప్రక్రియలో ఉపద్రవాన్ని సృష్టించడానికి లైసెన్స్ ఎంత మాత్రం కాదు. అయితే గవర్నర్లు చేస్తున్నదేమిటి? ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్లు అధికరణ 200 కింద తమకు లభించిన అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. శాసనసభ తన ఆమోదానికి పంపిన బిల్లులను తమ ఇష్టానుసారం నిలిపివేసేందుకు లైసెన్స్‌గా పరిగణిస్తున్నారు. ఈ భావనతోనే వారు పాకెట్ వీటోను ప్రయోగిస్తున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే జవాబుదారీతనం లేకుండా శాసనప్రక్రియను అడ్డుకుంటున్నారు. బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారు. బిల్లులను ఆమోదించడం లేదు. అలా అని తిరస్కరించడం లేదు. శాసనసభ పునఃపరిశీలనకూ పంపడం లేదు. రాష్ట్రపతి పరిశీలనకు సత్వరమే నివేదించడం లేదు. పాకెట్ వీటో అనేది ఒక నికార్సయిన దురుద్దేశం. శాసనసభ ఆమోదించిన బిల్లు రూపేణా వ్యక్తమైన ప్రజా సంకల్పాన్ని అడ్డుకోవడమే పాకెట్ వీటో లక్ష్యంగా ఉన్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే పాకెట్ వీటోకు భారత రాజ్యాంగంలో అనుమతి లేదు. ఒక బిల్లును గవర్నర్‌కు నివేదించినప్పుడు ఆయన దానిని ఆమోదించాలి లేదా తిరస్కరించాలి లేదా సాధ్యమైనంత త్వరగా శాసనసభ పునఃపరిశీలనకు పంపాలి లేదా రాష్ట్రపతి పరిశీలనకు నివేదించాలని సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. 'పాకెట్ వీటో' రాజ్యాంగ విరుద్ధమని ఆ ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ నిర్ణయాలను ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆమోదించింది. అయితే కొన్ని అంశాలపై ఈ రెండు ధర్మాసనాలూ విభేదించాయి. అయితే సామాన్య పౌరులు ఆందోళన చెందవలసినవి కావు. వాటిపై చర్చను న్యాయశాస్త్ర పండితులకు వదిలేద్దాం. శాసన సభ తనకు నివేదించిన బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్లకు నిర్దేశించిన కాలపరిమితి విషయమై సుప్రీంకోర్టు ధర్మాసనాల భిన్న దృక్కోణాలు సామాన్య పౌరులను కలవరపెడుతున్నాయి. ఇద్దరు సభ్యుల ధర్మాసనం కఠినమైన కాలపరిమితిని నిర్దేశించింది. ఆ గడువు తప్పనిసరి అని సూచించింది. విస్తృత ధర్మాసనం అందుకు అభ్యంతరం చెప్పింది. ఆ నిర్ణయాన్ని త్రోసిపుచ్చింది. 'రాజ్యాంగ అధికారులు తమ విధులను నిర్వర్తించడంలో సర్దుకుపోయే స్వభావాన్ని ప్రదర్శించాలని' సూచించింది. ఎటువంటి కాలపరిమితిని నిర్దేశించలేదు. ఇది రాజ్యాంగ చట్రంలో పొందుపరిచిన స్వాభావిక సరళత, విచక్షణను సూచిస్తుంది. సమాఖ్య ప్రజాస్వామ్య వ్యవస్థలో మారుతున్న విభిన్న సందర్భాలు, పరిస్థితులకు అనుగుణంగా శాసన నిర్మాణంలో సమతుల్యతను సాధించవలసిన అవసరమున్నదని ఐదుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. శాసన నిర్మాణంలో పాటించవలసిన ఈ సూత్రాలు సైద్ధాంతికంగా, రాజ్యాంగబద్ధంగా విమర్శాతీతమైనవి. అయితే డాక్టర్ అంబేద్కర్ హెచ్చరికను కూడా సుప్రీం కోర్టు పరిగణనలోకి తప్పక తీసుకోవాలి. భారత రాజ్యాంగ సభ ముగింపు సమావేశం (25 నవంబర్ 1949)లో అంబేద్కర్ ప్రసంగిస్తూ భారత ప్రజాస్వామ్య గమనం విషయమై కొన్ని సూచనాత్మక హెచ్చరికలు చేశారు: 'మన రాజ్యాంగ చట్టంలోని సుగుణాల గురించి నేను ప్రస్తావించను. ఎందుకంటే, రాజ్యాంగం ఎంత చక్కటిదయినప్పటికీ, దాన్ని పనిచేయించే పెద్దమనుషులు సరైనవారు కాకపోతే అది చెడ్డదే అవుతుంది. రాజ్యాంగం ఎంత చెడ్డదయినప్పటికీ దాన్ని పనిచేయించే పెద్ద మనుషులు మంచివారయితే, అది మంచిదే అవుతుంది. రాజ్యాంగ చట్ట స్వభావం మీదనే రాజ్యాంగం పని చేయడం ఆధారపడి లేదు. శాసన సభ, కార్యనిర్వాహక మండలి, న్యాయవ్యవస్థ లాంటి రాజ్యవ్యవస్థ విభాగాలను మాత్రమే రాజ్యాంగం అందించగలదు.

## దక్కిలి విద్యాభివృద్ధికి మరో మైలురాయి నవోదయ విద్యాలయం





**దక్కిలి, (రాజధాని వార్తలు):** సంగనపల్లిలో ఆర్డీవో స్థల పరిశీలన నవోదయ విద్యాలయం ఏర్పాటు "దక్కలి మండలానికి వరంగా నిలవనుంది నవోదయ పాఠశాల" దక్కలి మండలం సంగనపల్లి గ్రామ సర్వే నెంబరు 148/1లో ఉన్న సుమారు 24 ఎకరాల విస్తీర్ణంలోని భూమిని నూతన జవహర్ నవోదయ విద్యాలయం నిర్మాణానికి అనువుగా ప్రతిపాదించడంతో, శుక్రవారం గూడూరు ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ ఎం.బానుప్రకాశ్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. స్థల పరిశీలనలో భాగంగా ఆయన భూభాగం అనుకూలత స్థల సమతలీకరణ రోడ్డు సౌకర్యం విద్యుత్, త్రాగునీటి వసతులు సంబంధిత భూ రికార్డులు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అధికారుల అంచనా ప్రకారం ప్రతిపాదిత ప్రాంతం పాఠశాల భవన సముదాయ అభివృద్ధికి పూర్తిగా అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే నవోదయ పాఠశాల భవన సముదాయం నిర్మాణానికి టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుంది. దక్కలి పరిసర ప్రాంతాల్లో విద్యా అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలవనుందని స్థానిక అధికారులు అభిప్రాయపడుతున్నారు. "దక్కలి మండలం విద్యారంగ ప్రగతికి ఇది అసలైన వరం" అంటూ తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు అన్నారు.

## కార్పొరేటోడికి లక్షల ఎకరాలు 0.99 పైసలకే ధారపోస్తున్న చంద్రబాబు పేదోడికి 2 సెంట్లు ఇంటి స్థలం లేదంటారా

**- డబ్బులు చెల్లించిన అర్హులకు టిడ్కో ఇళ్ళను స్వాధీన పరచాలి - ప్రభుత్వ స్థలాల్లో ప్రస్తుతం నివాసం ఉంటున్న పేదలకు ఉన్న చోటనే పట్టాలు ఇవ్వాలి**

**- విజయనగరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్**






**విజయనగరం, (రాజధాని వార్తలు):** కార్పొరేటోడికి లక్షల ఎకరాలు ధారాదత్తం చేస్తున్న కూటమి పాలకులు పేదోడికి 2 సెంట్లు ఇంటి స్థలం అడిగితే మీనమేషాలు లెక్కిస్తున్న చంద్రబాబు మోసకారితానానికి నిదర్శనమని విజయనగరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బుగత అశోక్ విమర్శించారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయిలు ప్రభుత్వ ఆర్థిక సాయం అందించాలని, ప్రస్తుతం ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి ఉన్న చోటే పట్టాలు మంజూరు చేయాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని, డబ్బులు చెల్లించిన అర్హులందరికి టిడ్కో ఇళ్ళను స్వాదీన పరచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం సీపీఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ సక్రమంగా ముందుకు సాగలేదని కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సాయం పెంచడంతో ఇళ్లు కట్టుకునేందుకు సొంత స్థలం ఉన్న వారు చాలా మంది ముందుకొస్తున్నారనీ అన్నారు. పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలివ్వాలని గతంలో అనేకసార్లు అర్హులైన వారితో వ్యక్తిగత అర్జీలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి 18 మాసాలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రెండు సెంట్లు, మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల అని చెప్పి ఇంతవరకు దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అప్పులు చేసి ప్రభుత్వానికి డబ్బులు చెల్లించిన టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు పూర్తిగా అప్పగించకుండ నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయడంలో చంద్రబాబు కూటమి మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఇంటి స్థలం కోసం ధరఖాస్తు చేసుకోవడానికి వెళుతున్న లబ్దిదారులకు సొంత ఇళ్ళు లేకపోయినా ఇల్లు ఉన్నట్టుగా ఆన్లైన్ అయిపోయిందని సచివాలయ అధికారులు చెబితే నా పేరుతో ఇల్లు లేకపోయినా ఆన్లైన్లో ఎలా చూపిస్తుంది నా పేరుతో ఉన్న ఇల్లు ఎక్కడ ఉంది అని అర్జీదారులు అడిగిన ప్రశ్నలకు సమాధాం చెప్పకుండా మాట దాటావేస్తున్నారని తెలిపారు. అర్జీలు పెట్టుకున్న ప్రతి ఒక్కరి అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసే విధంగా సచివాలయ అధికారులకి పటిష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇళ్ళ స్థలాలు, ఇంటి పట్టాలు, టిడ్కో ఇళ్ళు అర్హులకి ఇచ్చేవరకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గం సిపిఐ నాయకులు ఎస్.రంగరాజు, బూర వాసు మరియు ఇళ్ళ స్థలాల కోసం అర్జీలు చేసుకున్నవారు హాజరయ్యారు.

## కరప మండలంలో "పరిశుభ్ర హరిత గ్రామం" శిక్షణా కార్యక్రమం





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్‌లోని కరప మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం "పరిశుభ్ర హరిత గ్రామం" శిక్షణా కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో జటావల్లభుల శ్రీనివాస్ కోర్సు డైరెక్టరుగా, డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు సహాయ కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో విజయవాడలోని ఆఫ్సీర్ డిపిఆర్ కమిషనర్ ఆదేశాల ప్రకారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామ సంక్షేమ సహాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగమైన థీమ్-5 "క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్"పై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ అందించారు. పంచాయతీ కార్యదర్శి కొరిపల్లె పి.లక్ష్మీనారాయణ మార్గదర్శకత్వంలో ఫ్యాకల్టీ బృందం గ్రామాల్లో శుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక సూచనలు తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి సాంకేతిక సహాయంగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, గ్రామ మహిళా పోలీసులు పాల్గొని సూచనలు అందించారు. ఈ శిక్షణ ద్వారా గ్రామీణ సముదాయాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై మరింత చైతన్యం పెంపొందించడంతో పాటు కరప మండలంలో "క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్" లక్ష్య సాధనకు దోహదం చేస్తుందని అధికారులు తెలిపారు. గ్రామాల పరిశుభ్రత, పచ్చదనం, చెత్త నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పిస్తూ శిక్షణ విజయవంతంగా ముగిసింది.

## సంకల్ప బలం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు : డిఎస్పీ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** సంకల్ప బలంతో గట్టిగా ప్రయత్నిస్తే దేనినైనా సాధించవచ్చునని పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరి రాజు అన్నారు. పోలీసు వృత్తిపై ఆసక్తి కలిగి స్వచ్ఛందంగా పోలీసులకు సహకరిస్తూ కష్టపడి కానిస్టేబుల్ జాబులను సంపాదించిన యువకులు దివాకర్, మణికంఠలను డీఎస్పీ శ్రీహరి రాజు సత్కరించి అభినందించారు. పెద్దాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చాలా కాలంగా వాలంటరీగా పరోక్షంగా సేవలందిస్తున్న దివాకర్ మణికంఠ అనే యువకులు ఎంతో కష్టపడి తాజాగా కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. దానితో ఆ ఇద్దరి యువకులను అభినందించాలనే కోరికతో డిఎస్పి ఉండగా సామర్లకోటకు చెందిన లైన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దివాకర్ మణికంఠలకు సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ పాల్గొని కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన యువకులిద్దరిని, వారికి పూర్తి సాకరాన్ని అందించి ప్రోత్సహించిన పెద్దాపురం సిఐ విజయశంకర్‌లను అభినందించారు. ఈ సందర్భంగా యువకులను పూలమాలలతో డీఎస్పీ సత్కరించి అభినందించారు.

## మహిళల భాగస్వామ్యంతో పూర్తి పరిశుభ్రత




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఇంటి పరిసరాల పరిశుభ్రత విషయంలో మహిళలు భాగస్వాము లైతే సమాజంలో పూర్తి పరిశుభ్రత సాధ్యమవుతుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీవో కే హిమ మహేశ్వరులు అన్నారు. పరిసరాల పరిశుభ్రత "క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్" సామర్లకోట మండల పరిధిలోని సర్పంచులు, ఉప సర్పంచులు, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఆర్‌సి సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డులు, వివోఏలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ సత్తిబాబు మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కుటుంబాల ఆర్థిక వికాసానికి ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య సమస్యల బారిన పడకుండా ఉండేందుకుగాను రాష్ట్ర ప్రభు త్వం మహిళలను "పచ్చదనం - పరిశుభ్రత" కార్యక్రమంలో భాగస్వాములను చేస్తుంది అన్నారు. ఇంటిని శుభ్రంగా ఉంచుకునే విషయంలో మహి ళలు ఎంత శ్రద్ధ తీసుకుంటారో అదే శ్రద్ధలు పరిసరాల విషయంలో కూడా తీసుకోవాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించేందుకు ఇప్పటికే ప్రత్యేక డబ్బాలను ఇంటింటికీ అందించగా వాటిలో తడి పొడి చెత్తలను వేరు చేసి సిబ్బందికి అందించడం ద్వారా దానినిదానిని వర్మీ కంపోస్ట్ కంపోస్ట్‌గా తయారుచేసి రైతులకు విక్రయించడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో సామర్లకోట మండలంలోని జీ మేడపాడు గ్రామంలోని, పెద్దాపురం మండలంలోని జి రాగంపేట గ్రామంలో తయారవుతున్న వర్మి కం పోస్టు దేశవ్యాప్తంగానే ఎంతో పేరు సంపాదించుకుందన్నారు. ఆ విధంగా ప్రతి గ్రామాన్ని తీర్చిదిద్దుకునేందుకు వీలుగా మహిళలు కృషి చేయాలన్నారు. శిక్షణలో ఎంపీడీవో హిమ మహేశ్వరి మాట్లాడుతూ మన ఇంటి బయట ఉన్న మురుగు కాలవల్లో వ్యర్థాలను వేయకుండా మహిళలు జాగ్రత్త పడాలన్నారు. దానివల్ల డెంగ్యూ వంటి దోమలు పెరిగి అవి మన ఇళ్లలోకే ప్రవేశించి మనకు హాని కలిగిస్తున్నాయన్నారు. కాబట్టి మహిళలంతా మన ఇంటితో పాటు మన పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంలో బాధ్యత వహించాలన్నారు. అయితే ఈ శిక్షణపై పరీక్ష నిర్వహించి ప్రభుత్వ నుంచి ప్రశంసా పత్రాలను అందించే ఏర్పాటు ఉందని, సెక్షన్ లోని విషయాలను సమగ్రంగా తెలు సుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్‌చే పచ్చదనం పరిశుభ్రతపై పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జగదీశ్వరి, సర్పంచులుసర్పంచులు, ఉప సర్పంచ్లు, గ్రీన్ కార్డులుగ్రీన్ గార్డులు, గ్రీన్ అంబాసిడర్లు గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ సెక్రటరీలు, వివోఏలు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


# శంకర్ రేసులో ఉన్నది ఎవరు..?




ఒకప్పుడు పాన్ ఇండియా డైరెక్టర్‌గా పాపులారిటీ తెచ్చుకున్న శంకర్ ఈమధ్య అసలేమాత్రం ఫాంలో లేరని తెలిసిందే. ఆయన ఫస్ట్ టైం తెలుగు స్ట్రైట్ సినిమాగా చరణ్ తో గేమ్ ఛేంజర్ చేశారు. ఆ సినిమాపై ఉన్న అంచనాలకు అది డిజాస్టర్ అయ్యింది. ఐతే గేమ్ ఛేంజర్ రిజల్ట్ చూసిన శంకర్ కాస్త గ్యాప్ తీసుకుని నెక్స్ట్ సినిమాతో భారీ ప్లానింగ్ తో వస్తున్నారు. శంకర్ నెక్స్ట్ సినిమా తన డ్రీమ్ ప్రాజెక్ట్ గా కొన్నాళ్ల నుంచి డిస్కషన్‌లో ఉన్న వేల్పారి చేయబోతున్నారట. దీనికి సంబందించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుందని తెలుస్తుంది. ఐతే ఒకప్పుడు శంకర్‌తో సినిమా అంటే నిర్మాతలు క్యూ కట్టేవారు.. హీరోలైతే ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. అఫ్కోర్స్ నిర్మాతలు ఆయన స్టామినా గురించి తెలిసి తీస్తామని వస్తున్నా కూడా హీరోలు డేర్ చేసే పరిస్థితి కనిపించట్లేదు. రజనీకాంత్, కమల్ హాసన్ ఆల్రెడీ శంకర్‌తో చేశారు కాబట్టి అయినా ఇప్పుడు వారి వారి సినిమాల కమిట్మెంట్‌తో ఉన్నారు కాబట్టి వారు శంకర్ తో తీసే ఛాన్స్ లేదు. నెక్స్ట్ విజయ్ ఎలాగు సినిమాలకు గుడ్ బై చెప్పేశాడు. అజిత్, విక్రంలాంటి వారితో శంకర్ చేస్తాడా అన్న చర్చ నడుస్తుంది. ఐతే శంకర్ దృష్టిలో శివ కార్తికేయన్ పడినట్టు తెలుస్తుంది. వీజే నుంచి కోలీవుడ్ స్టార్ గా శివ కార్తికేయన్ ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చాడు. శివ కార్తికేయన్‌తో అయితే ప్రాజెక్ట్ అదిరిపోతుందని భావిస్తున్నారట.

ఐతే శంకర్ లాంటి డైరెక్టర్‌తో సినిమా అంటే శివ కార్తికేయన్ నో చెప్పే ఛాన్స్ లేదు. ఐతే అతనితో పాటు శంకర్ సూర్య, ధనుష్ పేర్లను కూడా పరిశీలిస్తున్నట్టు తెలుస్తుంది. సో శంకర్ నెక్స్ట్ సినిమా ఎవరు చేసినా సరే ఆ స్టార్ ఫ్యాన్ బేస్, క్రేజ్ తో పాటు ఒకప్పటి శంకర్ డైరెక్షన్ టాలెంట్ కూడా చూస్తారని అంటున్నారు. త్వరలోనే ఈ సినిమా అఫీషియల్ స్టేట్మెంట్ రాబోతుందట. ఆ టైంలోనే శంకర్‌తో చేసే హీరో మిగతా కాస్టింగ్ ఫైనల్ అవుతుందని తెలుస్తుంది. మరి శంకర్ ఈసారి ఎవరితో సినిమాకు రెడీ అవుతున్నారు అన్నది త్వరలో తెలుస్తుంది. తమిళ్‌తో పాటు తెలుగు మిగతా సౌత్ ఆడియన్స్‌కి పరిచయం ఉన్న స్టార్స్ అయితే బిజినెస్ తో పాటు సినిమా కూడా ఎక్కువ రీచ్ ఉంటుందని శంకర్ ఇలా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. శంకర్ నెక్స్ట్ ప్రాజెక్ట్ పై జరుగుతున్న ఈ డిస్కషన్ కోలీవుడ్ ఫ్యాన్స్‌ని సూపర్ ఎగ్జైట్ చేస్తుంది.

# పవన్ డేట్ల కోసం దిల్ రాజు.. క్యూలో ఉన్నోళ్లకి షాక్ ఇస్తాడా?





పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఫుల్ బిజీ. రాజకీయాలు, సినిమాలు బ్యాలెన్స్ చేయడం మరింత కష్టమైంది. డేట్ల కోసం నిర్మాతలు క్యూ కడుతున్నారు. ఈ లిస్ట్ లో దిల్ రాజు కూడా ఉన్నారు. అయితే మిగతా వారిలా క్యూలో వెయిట్ చేయడం రాజు గారికి ఇష్టం లేనట్లుంది. అందుకే త్వరగా పని జరిపించుకోవడానికి ఒక బలమైన అస్త్రాన్ని సిద్ధం చేసుకున్నారు. అందరూ ఒక దారిలో వెళ్తుంటే, ఈ బడా నిర్మాత మాత్రం తన పని కోసం ఒక 'షార్ట్ కట్' వెతుక్కున్నారు. సాధారణంగా పవన్‌ను ఒప్పించడం ఇప్పట్లో అయ్యే పని కాదు. చేతిలో ఉన్న ప్రాజెక్టులు పూర్తవ్వడానికే రెండేళ్లు పడుతుంది. కానీ దిల్ రాజు మాత్రం ఈ గ్యాప్ లోనే దూరిపోవాలని చూస్తున్నారు. దానికోసం నేరుగా పవన్‌ను కాకుండా, పవన్ ఎవరి మాటైతే జవదాటరో.. ఆ వ్యక్తిని రంగంలోకి దించుతున్నారు. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఆ మధ్యవర్తి తలచుకుంటే అసాధ్యం కూడా సుసాధ్యం అవుతుందని రాజు గారి గట్టి నమ్మకం. ఆ వ్యక్తి మరెవరో కాదు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. దిల్ రాజు నేరుగా త్రివిక్రమ్‌ను కలిసి ఈ బాధ్యత అప్పగించారట. పవన్‌తో సినిమా సెట్ చేసి పెట్టమని, తన దగ్గర ఉన్న దర్శకుల లిస్ట్ కూడా గురూజీ చేతిలో పెట్టారని టాక్. పవన్ కళ్యాణ్‌కు త్రివిక్రమ్ అంటే ఎంత ప్రత్యేకమో, ఆ బంధం ఎంత బలమైనదో ఇండస్ట్రీలో అందరికీ తెలిసిందే. పవన్ తనకు స్క్రిప్టుల బాధ్యతను పూర్తిగా త్రివిక్రమ్‌కే వదిలేశారు. వాస్తవానికి మైత్రీ మూవీ మేకర్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్, రామ్ తాళ్లూరి వంటి సంస్థలకు పవన్ ఎప్పుడో కమిట్ అయ్యారు. 2027 వరకు డైరీ ఫుల్. కానీ త్రివిక్రమ్ కనుక సీరియస్ గా తీసుకుంటే సీన్ మొత్తం మారిపోతుంది. గురూజీ సూచన మేరకు పవన్ తన లైనప్ మార్చుకుని, దిల్ రాజు ప్రాజెక్ట్‌ను ముందుకు తెచ్చే అవకాశం ఉందని దిల్ రాజు గట్టి నమ్మకంతో ఉన్నారు.

అలా జరిగితే మిగతా నిర్మాతలకు అది బిగ్ షాక్‌గా మారవచ్చు. ప్రస్తుతం ఈ వ్యవహారం అంతా చర్చల దశలోనే ఉంది. దిల్ రాజు ప్రపోజల్‌కు పవన్ పాజిటివ్ గానే ఉన్నా, ఫైనల్ డెసిషన్ మాత్రం త్రివిక్రమ్ తీసుకుంటారని అర్థమవుతోంది. కథ, దర్శకుడి ఎంపిక అంతా త్రివిక్రమ్ కనుసన్నల్లోనే జరగనుంది. ఇది వర్కవుట్ అయితే క్యూలో ఉన్న మిగతా నిర్మాతలకు గట్టి షాక్ తగిలినట్లే. సో.. దిల్ రాజు వేసిన ఈ మాస్టర్ ప్లాన్ ఫలిస్తుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. డిప్యూటీ సీఎంగా బిజీగా ఉన్న జనసేనానిని త్రివిక్రమ్ ఎలా ఒప్పిస్తారో, రాజు గారి కోరికను ఎలా నెరవేరుస్తారో చూడాలి. అంతా అనుకున్నట్లు జరిగితే త్వరలోనే ఒక క్రేజీ న్యూస్ వినొచ్చు.

# స్పిరిట్ లీక్.. సందీప్ వంగ హ్యాపీ..?




యానిమల్ తర్వాత సందీప్ వంగ డైరెక్ట్ చేస్తున్న సినిమా స్పిరిట్. రెబల్ స్టార్ ప్రభాస్ తో సందీప్ చేస్తున్న ఈ మూవీపై రెబల్ ఫ్యాన్స్ సూపర్ ఎగ్జైటెడ్‌గా ఉన్నారు. సినిమా గురించి రీసెంట్‌గా వచ్చిన ఫస్ట్ సౌండ్ స్టోరీ రెస్పాన్స్ అదిరిపోయింది. సినిమాలో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు. ఐతే ప్రభాస్ స్పిరిట్ సినిమా హైదరాబాద్‌లో జరుగుతుంది. కోటి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా షూటింగ్ నుంచి ప్రభాస్ లుక్ లీక్ అయ్యింది. సెట్‌లో ప్రభాస్, సందీప్ వంగ మాట్లాడుతున్న వీడియో.. సెట్‌లో ప్రభాస్, సందీప్ వంగ మాట్లాడుతున్న వీడియో బయటకు వచ్చింది. ఆ లీకైన వీడియోలో ప్రభాస్ పోలీస్ డ్రెస్‌లో ఉన్నాడు. ఇది చూసి రెబల్ స్టార్ ఫ్యాన్స్ సూపర్ హ్యాపీగా ఉన్నారు. ఐతే స్పిరిట్ షూటింగ్ రీసెంట్ గానే మొదలైంది. మరి షూటింగ్ నుంచి లీక్స్ జరగకుండా చేయాల్సిన బాధ్యత డైరెక్టర్ మీద ఉంటుంది. ఐతే సందీప్ వంగ మాత్రం స్పిరిట్ వీడియో లీక్‌పై అంత సీరియస్‌గా లేరని టాక్. లీక్ అయితే అయ్యింది అందులో మ్యాటర్ ఏముంది అన్నట్టుగా చెప్పాడట. ఓ విధంగా స్పిరిట్ గురించి ఈ లీకైన వీడియో ద్వారా సోషల్ మీడియాలో ఇంకాస్త డిస్కషన్ జరుగుతుందని భావిస్తున్నారట సందీప్ వంగ. స్టార్ సినిమాకు ఇలాంటి లీక్స్ కాస్త ఎఫెక్ట్ చూపిస్తాయి. ఐతే అది సందీప్ వంగ సినిమా కాబట్టి ఆ లీక్ అయిన వీడియో వల్ల ఏమంత ఇంపాక్ట్ ఉండదని అంటున్నారు. ప్రభాస్ స్పిరిట్ 2027 లో రిలీజ్.. స్పిరిట్ సినిమా విషయానికి వస్తే ఈ సినిమాలో ప్రభాస్ అసలు సిసలు యాక్షన్ చూపిస్తా అంటున్నాడు సందీప్ వంగ. ప్రకాష్ రాజ్‌తో పాటు సౌత్ కొరియన్ డాన్ లీని కూడా తీసుకొస్తాడన్న చర్చ జరుగుతుంది. సినిమాలో యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రభాస్ స్పిరిట్ సినిమాను 2027 లో రిలీజ్ చేసేలా సందీప్ వంగ ప్రయత్నిస్తున్నారు.

ప్రభాస్ స్పిరిట్‌తో పాటు హనుతో ఫౌజీ కూడా చేస్తున్నాడు. మారుతి డైరెక్షన్‌లో చేసిన రాజా సాబ్ 2026 సంక్రాంతి రిలీజ్‌కి రెడీ అవుతుంది. నెక్స్ట్ ఇయర్ సెకండ్ హాఫ్‌లోనే ఫౌజీ కూడా రిలీజ్ చేసే ప్లాన్ ఉందని తెలుస్తుంది. స్పిరిట్ సినిమాను సందీప్ వంగ తన మార్క్ యాక్షన్ మూవీగా ఒక డిఫరెంట్ సెటప్‌లో ప్లాన్ చేస్తున్నారు. ఐతే సెట్స్ మీదకు వెళ్లిన వెంటనే స్పిరిట్ వీడియో లీక్‌పై ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఈ లీక్స్ సినిమాపై ఉన్న బజ్‌ని తగ్గించేలా చేస్తాయి. అందుకే ఈ లీక్‌తో మేకర్స్ షూటింగ్ స్పాట్‌ని మరింత కట్టుదిట్టం చేయనున్నారు.

# సుక్కు యూనివర్స్.. పుష్ప రాజ్‌తో చరణ్ కలిస్తే..?



ఇప్పుడు ప్రతి ఒక్కరు సినిమాటిక్ యూనివర్స్‌తో హంగామా చేస్తున్నారు. అలాంటిది ఒకటి మన పాన్ ఇండియా డైరెక్టర్ సుకుమార్ కూడా చేస్తే చూడాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. సుకుమార్ డైరెక్షన్‌లో అల్లు అర్జున్ చేసిన పుష్ప సినిమా చేసిన అద్భుతాలు తెలిసిందే. నేషనల్ లెవెల్‌లో పుష్ప రాజ్ పూనకాలు బాక్సాఫీస్‌ని షేక్ చేశాయి. సుకుమార్ కూడా ఈ రేంజ్ సక్సెస్‌ని అసలు ఊహించలేదు. ఇక పుష్ప 2 తోనే ముగిస్తాడు అనుకున్న సుకుమార్ పార్ట్ 3 కూడా పెట్టాడు. పుష్ప 3 రాంపేజ్ కూడా నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతుందని తెలుస్తుంది. ఐతే పుష్ప 3 కన్నా ముందు రామ్ చరణ్‌తో సినిమా ఫిక్స్ చేసుకున్నాడు సుకుమార్. చరణ్‌తో రంగస్థలం తర్వాత చేస్తున్న సినిమా కాబట్టి ఈ ప్రాజెక్ట్‌పై నెక్స్ట్ లెవెల్ బజ్ ఉంది. ఐతే చరణ్‌తో సుకుమార్ చేసే సినిమా పుష్ప యూనివర్స్‌లో చేస్తే ఎలా ఉంటుంది అనే డిస్కషన్ నెటిజెన్స్‌లో మొదలైంది. పుష్ప యూనివర్స్ అందులోనూ చరణ్ జస్ట్ ఇమాజిన్ చేస్తేనే ఒక రేంజ్ హై ఇస్తుంది. ఈ ఆలోచన సుకుమార్‌కి వస్తే ఎలా ఉంటుందన్న చర్చ నడుస్తుంది. అటు ఓ పక్క పుష్ప రాజ్‌గా అల్లు అర్జున్‌ని మ్యాచ్ చేసేలా చరణ్ క్యారెక్టర్ రాసుకుని చరణ్ సినిమా చివర్లో పుష్ప రాంపేజ్‌కి లీడ్ ఇస్తే పుష్ప 3లో అల్లు అర్జున్, చరణ్ నటించేలా కథ రాస్తే మాత్రం ఒక్క రికార్డ్ కూడా వదలకుండా రచ్చ రచ్చ చేస్తారు. అటు గ్లోబల్, ఇటు ఐకాన్ స్టార్ ఫ్యాన్స్ అంతా కూడా ఈ కాంబో సినిమా అంటే ఒక రేంజ్ హైప్ తెస్తారు. ఆర్‌ఆర్‌ఆర్‌తో చరణ్, ఎన్టీఆర్ కాంబినేషన్‌నే సెట్ చేశాడు రాజమౌళి. అలాంటిది సుకుమార్ తలచుకుంటే చరణ్, అల్లు అర్జున్ ని కలపి సినిమా తీయలేడా అన్న డిస్కషన్ మొదలైంది. ఏది ఏమైనా ఇది జస్ట్ ఒక రూమర్‌లా అనిపిస్తున్నా కూడా ఇలా జరిగితే మాత్రం వెండితెర మీద అల్లు అర్జున్, చరణ్ విధ్వంసం ఒక రేంజ్‌లో ఉంటుందని చెప్పొచ్చు. సుకుమార్ టీంలో ఎవరైనా ఇలాంటి ఒక థాట్‌ని ఆయన ముందు ఉంచితే తప్పకుండా ఫ్యాన్స్‌కి పండగ అన్నట్టే అని చెప్పొచ్చు. పుష్ప యూనివర్స్‌లోకి చరణ్ వస్తాడా.. చరణ్‌తో యూనివర్స్ స్టార్ట్ చేసి అందులో పుష్పని తెస్తాడా అన్నది తెలియదు కానీ సుకుమార్ ఇలా తన సినిమాటిక్ యూనివర్స్‌ని ప్లాన్ చేస్తే మాత్రం బాక్సాఫీస్ షేక్ అవ్వడం కాదు రికార్డుల మోత మోగిపోతుందని చెప్పొచ్చు.

# వెంకటచలం, సర్వేపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం - 5వ రోజు ఉత్సాహం



**వెంకటచలం, (రాజధాని వార్తలు):** మండలంలోని సర్వేపల్లి గ్రామంలో జరుగుతున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. బిట్–2 పరిధిలో నిర్వహి స్తున్న ఈ శిబిరంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ ఎస్ యూనిట్–5 విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

**రక్త పరీక్షలు, కంటి చూపు వైద్య శిబిరం**

విద్యార్థుల సహకారంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ మరియు విక్రమ సింహపురి యూనివర్సిటీ NSS Unit-5 సంయుక్తంగా ఉచిత వైద్య పరీక్షలను అందించారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. మొత్తం 80 మందికి కంటి చూపు పరీక్షలు, 75 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో విద్యార్థులు, ట్రస్ట్ సభ్యులు సమిష్టిగా కృషి చేశారు.

**ఆరోగ్య అవగాహన ర్యాలీ**

వైద్య సేవల అనంతరం, గ్రామ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా "ఆరోగ్యమే మహాభాగ్యం" నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రత, సరైన ఆహారపు అలవాట్లు, నిత్య వ్యాయామం ద్వారా లభించే ప్రయోజనాలు వంటి అంశాలను ప్రజలకు వివరించారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించగా, స్థానిక ప్రజలు ఆసక్తిగా వీక్షించి వారి సేవాభావాన్ని అభినందించారు.

**శిబిరం ముగింపు వివరాలు**

ఎన్ఎస్ఎస్ శిబిరం ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనుందని, మిగిలిన రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ పి.బి.సుచరిత తెలిపారు.

# ప్రజలందరికీ గోదావరి రక్షిత జలాలు

## - గోదావరి పైపులైన్ ప్రాజెక్టుకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గోదావరి రక్షిత జలాలను గ్రామాల్లోని ఇంటింటికి, ప్రజలందరికీ చేరవేసే లక్ష్యంతో భారీ పైపులైన్ ప్రాజెక్టు పనులు చేపట్టినట్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, బీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) లు పేర్కొన్నారు. సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో "జల్ జీవన్ మిషన్" నిధులు రూపాయలు రూ. 1650 కోట్లు వ్యయంతో చేపట్టనున్న పైప్ లైన్ నిర్మాణం పనులకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబులు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు రూరల్ వాటర్ సప్లై శాఖ ఆధ్వర్యంలో ధవళేశ్వరం నుండి సామర్లకోట సహా పరిసర గ్రామాలకు స్వచ్ఛమైన గోదావరి నీరు అందించేందుకు ప్రభుత్వం కీలక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.1650 కోట్ల భారీ నిధులు కేటాయించగా, మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పైపులైన్ ఏర్పాటు, ఇతర నిర్మాణ పనులను చేపట్టనుందన్నారు. రెండేళ్లలోగా మొత్తం పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికీ గోదావరి రక్షిత నీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. ధవళేశ్వరం వద్ద ప్రాజెక్టుకు చెందిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించి అక్కడ నుంచి నేరుగా ఫిల్టర్ జలాలను గ్రామాలకు అనుసంధానం చేస్తూ పైప్ లైన్ల ద్వారా పంపనుందన్నారు. మండలంలోని ఉండూరు, పెద్ద బ్రహ్మదేవం గ్రామాల వద్ద గోదావరి జలాల పైప్ లైన్‌ల ఇన్‌లెట్‌లు ఏర్పాటు చేయ డం జరుగుతుందన్నారు. పనసపాడు దేవి ఫిషరీస్ పరిశ్రమ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ పబ్లిక్ వాటర్ స్కీమ్ శంకుస్థాపన కార్యక్రమం ఏపీ ఎన్జీవో కాలనీ పంచాయతీ సామాజిక స్థలంలో జరిగింది. గ్రామానికి అదనంగా ఒక కొత్త వాటర్ ట్యాంక్‌ను కూడా ప్రభుత్వం శాంక్షన్ చేసినట్లు చెప్పారు. అలాగే పి వేమవరం గ్రామంలో రూ. 49.50 లక్షలు వ్యయంతో నిర్మించిన వాటర్ ట్యాంక్ పనులను ఎమ్మెల్యే రాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచి చీకట్ల వెంకటేష్, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, నూనె రామారావు, అందుగుల జార్జి చక్రవర్తి, సామర్లకోట మండల టిడిపి అధ్యక్షుడు ముసిరెడ్డి శ్రీరాములు, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ ఎన్ ఎస్ స్వామి, ఏఈ సుభాషిని, ఉండూరు సొసైటీ అధ్యక్షుడు బచ్చల జేమ్మి పనసపాడు పంచాయతీ వార్డు సభ్యులు, బూత్ ఇన్‌చార్జిలు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వింజమూరులో కొత్త అన్నా క్యాంటీన్ భవనం : ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జాయింట్ కలెక్టర్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వింజమూరు మండల కేంద్రంలో కొత్తగా నిర్మాణం పూర్తిచేసుకున్న అన్నా క్యాంటీన్ భవనాన్ని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుతో కలిసి స్వయంగా సందర్శించి, పరిశీలించారు. నిర్మాణ పనులు, వసతులు, ప్రజలకు అందించాల్సిన సేవలపై సమగ్రంగా అవగాహన తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రతి నియోజక వర్గములో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేద ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని సంకల్పం చేశారు. ఇందులో భాగంగా వింజమూరు ప్రజలకు నాణ్యమైన భోజనాన్ని తక్కువ ధరలో అందించేందుకు అన్నా క్యాంటీన్ ఎంతో ఉపయోగకరంగా ఉండబోతోందని తెలిపారు. అన్ని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తున్నామని, అత్యంత త్వరలో క్యాంటీన్‌ను ప్రజల సేవకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా పేదల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన అడుగు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఘనంగా కందుల బద్రీనాథ్ పుట్టినరోజు వేడుకలు

## - అరుణాచలం లింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు కుమారుడు కందుల బద్రీనాథ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరెళ్ల కోనేరు ప్రాంతంలో గల అరుణాచల లింగేశ్వర శివాలయంలో బద్రీనాథ్, సుప్రియ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయానికి శఠగోపం, ఉద్దరిణి, పళ్లెం బహూకరించారు. ఈ సందర్భంగా పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కందుల నాగరాజు, కందుల కేదార్నాథ్, స్వాతి దంపతులు, కుటుంబ సభ్యులు, కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ్ శివ శ్రీనివాసరావు శ్రీ తాడూరి రామ్‌ను కలిసిన జనసేన పార్టీ నాయకులు బత్తల శ్రీకాంత్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నేడు జనసేన మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ పదవీ బాధ్యతలు తీసుకోబోతున్న జనసేన పార్టీ స్టేట్ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ కళ్యాణ్ శివ శ్రీనివాస రావు (కేకే)ని మరియు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ తళ్లూరి రామ్‌ని నెల్లూరు నగర మూడో డివిజన్ జనసేన పార్టీ ఇంచార్జ్ బత్తల శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం సుపరిపాలనపై పేదలు మహిళలు ఎక్కడికి వెళ్ళినా తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారని ఈ సందర్భంగా శ్రీకాంత్ తెలియజేశారు.

# "మహాత్మ జ్యోతిరావు పూలేకు కాకాణి ఘన నివాళి"





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నివాళులర్పించిన రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. తమ జీవితకాలం మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలే. కూటమి పాలనలో జ్యోతిరావు పూలేలాంటి మహనీయుల ఆశయాలు అడుగంటిపోతున్నాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిరావు పూలే లాంటి మహనీయుల ఆశయాల ఆచరణ కోసం నిరంతరం కృషిచేస్తున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి. మహిళల కోసం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిన నాయకుడు మన జగన్మోహన్ రెడ్డి. మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన జగన్మోహన్ రెడ్డి వల్లే సాధ్యమని ప్రజలు భావిస్తున్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా, సమాజాభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన నివాళులర్పిస్తుంది. మహాత్మ జ్యోతిరావు పూలే కృషి ఫలితంగా నేడు మహిళలు విద్యను అభ్యసించడంతో పాటు, అన్ని రంగాలలో రాణించగలుగుతున్నారు. మొదటి మహిళా అధ్యాపకురాలు సావిత్రిభాయి పూలేని భారతదేశానికి అందించిన ఘనత మహాత్మ జ్యోతిరావు పూలేది. అంటరానితనం నిర్మూలనకు, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. కూటమి పాలనలో ఏ ఒక్క వర్గానికి న్యాయం జరగడం లేదు. మహాత్ముల ఆశయ సాధన జగనన్నతోనే సాధ్యం. –మహాత్మ జ్యోతిరావు పూలే.

ఆశయాలకు అనుగుణంగా అన్ని వర్గాలకు న్యాయం చేసిన వ్యక్తి మన జగనన్న. మహిళలను సాధికారత వైపు అడుగులు వేయించిన ఘనత మన జగనన్నది. మహిళాభి వృద్ధి కోసం కృషిచేసిన జగనన్నతో కలిసి నడవడం సంతోషంగా ఉంది. జగనన్న మళ్ళీ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలం దరూ కోరుకుంటున్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నాం.



# రైతులకు యూరియా పంపిణీ

**దక్కిలి, (రాజధాని వార్తలు):** మాధవయపాలెం సొసైటీ పరిధిలోని రైతులకు శుక్రవారం యూరియా పంపిణీ జరిగింది. ప్రతి రైతుకు యూరియా అందుతుందని ఎవరు కూడా ఆందోళన పడాల్సిన పనిలేదని మాజీ జెడ్పీటిసి మాధవయపాలం సొసైటీ అధ్యక్షులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు మాట్లాడారు. రైతులు యూరియా కార్డులను స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోకూరు రమేష్ నాయుడు,పిపి చౌదరి పోకూరు పుల్లయ్య నాయుడు తదితరులున్నారు.

# ఘనంగా "బాల్య వివాహ ముక్త భారత్"




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్ట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సంయుక్తంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సామర్లకోట మండలం మాధవ పట్నం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్‌లో బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ, ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ జి.ఉష, గ్రామ సర్పంచి యమ్ సుగుణమ్మ, యమ్‌పిటిసి జి కృష్ణ అర్జునరావులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపివో ఉష మాట్లాడుతూ నవంబర్ 27, 2024 నుండి "బాల్య వివాహ ముక్త భారత్" అనే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. దేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహ నిరోధ చట్టం 2006 ప్రకారం బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారం నేరం, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని లేదంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 27 నవంబర్ 2025 నుండి 8 మార్చ్ 2026 వరకు 100 రోజుల అవగాహన కార్యక్రమాలును క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించడం జరుగుతుందన్నారు. బాల్య వివా హాలు జరగకుండా కాపాడాల్సిన బాధ్యత సమాజ ములో అందరిపైన ఉందన్నారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించిన మరియు సహకరించిన లేదా 18 సంవత్సరాలు అమ్మాయికి నిండకుండా, 21 సంవత్సరాలు పూర్తి కాకుండా అబ్బాయికి వివాహం చేసిన బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం లేదా పోక్సో చట్టం చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. బాలల విద్య, భద్రత కోసం ప్రతీ పౌరుడు గళాన్ని వినిపించాలని, బాల్య వివాహ ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇవ్వాలని అన్నారు. అందులో బాగంగానే ఈరోజు జిల్లా లోని అన్ని గ్రామాలలో క్యాండిల్ లైట్ ర్యాలీ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ బి లక్ష్మీ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, సూపర్వైజర్ నళిని, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సీపీఎం నాయకులు జొన్నలగడ్డ వెంకంరాజుని పరామర్శించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి





**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు జొన్నలగడ్డ వెంకంరాజు సతీమణి జొన్నలగడ్డ నర్మదా ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శనివారం బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలోని వారి స్వగృహానికి వెళ్లి స్వర్గీయ నర్మదా చిత్రపటానికి మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు బొతంశెట్టి శ్రీనివాసులు, గండవరపు శ్రీనివాసులు, వైసీపీ మండల పార్టీ కన్వీనర్లు, కౌన్సిలర్లు మరియు వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి- పి.యు- ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ







**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నవజీవన్ ఆర్గనైజేషన్ – సి.సి. పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో క్రొవ్వొత్తుల ర్యాలీ మరియు ఐ.ఇ.సి కరపత్రాల పంపిణీ ద్వారా హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ పై అవగాహన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ – సి.సి– పి.యు– ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని "క్రొవ్వొత్తుల ర్యాలీ మరియు ఐ.ఇ.సి కరపత్రాల పంపిణీ ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహనను నాయుడుపేట సూళ్లూరుపేట, వెంకటగిరి మరియు దొరవారి సత్రంలోని ఏరియాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో భాగంగా ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజి మాట్లాడుతూ ఈ క్రొవ్వొత్తుల ర్యాలీ మరియు ఐ.ఇ.సి కరపత్రాల పంపిణీ చేయడం ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి, ఎ.ఆర్.టి మందులు గూర్చి తెలియజేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ సి.సి పి.యు సిబ్బంది అయిన కవిత, మంజుల, నందిని, శ్రావణి, సాయి లక్ష్మి, ఐశ్వర్య, ముని కూమారి, శ్రీలత, పి.ఇలు మరియు ఇతర మహిళలు పాల్గొని ప్రజలకు హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహనను కల్గించడం జరిగింది అని తెలియజేశారు.

# విద్యార్థినుల భద్రతకు 'శక్తి' యాప్

## - బస్సును ఆపి అవగాహన కల్పించిన సంగం సీఐ వేమారెడ్డి

**సంగం, (రాజధాని వార్తలు):** మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన 'శక్తి' మొబైల్ యాప్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, తప్పనిసరిగా తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి పిలుపునిచ్చారు. సంగం పరిధిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సును సీఐ వేమారెడ్డి మార్గమధ్యంలో ఆపారు. బస్సులోని విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా శక్తి యాప్ గురించి సమగ్రంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 'శక్తి' యాప్‌లోని ఎస్ఓఎస్ (ఎస్ ఓ ఎస్) బటన్‌ను నొక్కితే వెంటనే ఆ సమాచారం సమీపంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌కు చేరుతుందని, తద్వారా పోలీసులు నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయం అందించగలుగుతారని సీఐ తెలిపారు. విద్యార్థినులు, మహిళలు ఆపదలో ఉన్నప్పుడు



భయపడాల్సిన అవసరం లేదని, రక్షణ కోసం ఈ యాప్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. మహిళా భద్రతకు కవచంలాంటి ఈ యాప్‌ను కళాశాల విద్యార్థినులందరూ వారి మొబైల్ ఫోన్లలో వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

# మాస్టర్ ఓరేటర్ కాంటెస్ట్ ప్రోగ్రాంలో గోమతి నారాయణ విద్యార్థుల ప్రతిభ

## - విద్యార్థులను అభినందించిన వేమిరెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో రెండు రోజులపాటు ఉత్సాహంగా సాగిన మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్ సాఫ్ట్ స్కిల్స్ సీజన్ 6 గ్రాండ్ ఫినాలేలో, నారాయణ గోమతి సీబీఎస్ఈ స్కూల్కు చెందిన విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి సత్తా చాటారు. విద్యార్థులు ఓరేటర్ వేదికపై ఆత్మవిశ్వాసం, స్పష్టమైన ప్రెజెంటేషన్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, తమ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఒరేటరీ స్కిల్స్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, న్యాయ నిర్ణేతలు విద్యార్థుల ప్రతిభను ప్రశంసించి అభినందించారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులు గ్రాండ్ ఫినాలే లో విజయం సాధించడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని విజయాలు సాధించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయని పేర్కొన్నారు. గ్రాండ్ ఫినాలే విజేతల జాబితా గ్రేడ్ 1లో మోహిత్ గ్రేడ్ 2 లో అద్విక, గ్రేడ్ 3లో మీరజ్ అమాన్ గ్రేడ్ 4 – బి2 క్యాటగిరిలో లినీషా కొలస్టిక్, జినిషా, జిషిత రెడ్డి, హిబ్బ, జోషిత, శ్రీ మహిమ, కార్తిక నిత్య తదితరులు వివిధ విభాగాలలో విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా నారాయణ గ్రూప్ జనరల్ మేనేజర్ శ్రీ వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి విజేతలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

# వృద్ధాశ్రమాలు లేని సమాజం రావాలి : డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి



**కాకినాడ, (రాజధాని వార్తలు):** వృద్ధాశ్రమాలు లేని సమాజం ఉండాలన్నదే తన ఆశయమని దీని ద్వారా కుటుంబ వ్యవస్థ పదిలంగా ఉండే అవకాశం ఉంటుందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధికారిక పర్యటనలో భాగంగా శుక్రవారం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పర్మినెంట్ ప్రాజెక్టులను క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఆయా ప్రాజెక్టుల చైర్మన్లు రోటరీ గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తికి చూపించి వాటి సేవా కార్యక్రమాలను వివరించారు. తొలుత అచ్చంపేట గ్రామంలో నిర్వహిస్తున్న రక్షత మంచినీటి ప్రాజెక్టును చైర్మన్ చెలికాని సూర్యారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి స్వాగతం పలికి గత దశాబ్ద కాలంగా రక్షత మంచినీటి సరఫరా విషయంలో అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలుపుకున్నారు. చెలికాని సూర్యారావు మాట్లాడుతూ ఆనాడు ఈ ప్రాంతంలో తొలిసారిగా రక్షత నీటి ప్రాజెక్టును ప్రారంభించిన ఘనత రోటరీ గోల్డెన్ జూబ్లీకే దక్కుతుందని దీని ద్వారా అదే తక్కువ ధరకే రక్షిత మంచినీటిని ప్రజలకు సరఫరా చేస్తూ ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతమిస్తున్నామని గుర్తు చేశారు. ప్రజలకు ఎంతో ఉపయోగపడే విధంగా ఈ ప్రాజెక్టును విజయవంతంగా గ్రామ ప్రజల సహకారంతో నిర్వహిస్తున్నామని సూర్యారావు వివరించారు. అనంతరం రోటరీ వృద్ధాశ్రమాన్ని సందర్శించినప్పుడు కమిటీ చైర్మన్ డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమ కమిటీ సభ్యులతో పాటు నివాసముంటున్న మహిళలందరూ రోటరీ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి అపూర్వ ఆప్యాయత స్వాగతాన్ని పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ ఎస్ వి ఎస్ రావు చేతుల మీదుగా కమిటీ చైర్మన్ డాక్టర్ సతీష్ కోశాధికారి భూపేంద్ర లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ వృద్ధాశ్రమ వ్యవస్థాపకురాలు క్లబ్ పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి 80 సంవత్సరాల విజయ యాత్ర అనే అపూర్వ గ్రంథాన్ని డాక్టర్ వై కళ్యాణ్ చక్రవర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు ఉద్దేశించి డా కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగించడమే హైందవ ధర్మానికి ప్రతి కని నేడు కొన్ని కారణాల దృష్ట్యా వృద్ధాశ్రమాలలో వారి పేరెంట్స్ ఉంచుతున్నారని చెప్పారు. నేటి తరానికి వృద్ధుల యొక్క విలువ, వారి జ్ఞానం, వారి అనుభవం తెలుసుకోవడానికి వీలు లేకుండా పోతుందని కళ్యాణ్ చక్రవర్తి ఆవేదన వ్యక్తం చేశారు. రోటరీ వృద్ధాశ్రమంలో నివాసముంటున్న మహిళలందరూ గృహ వాతావరణంలాగా మరియు అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక వైద్య సేవలను కూడా సకాలంలో అందిస్తూ తమ ఇంటి వ్యక్తులుగా చూసుకుంటున్నారని ఎంతో ఆనందంగా చెప్పడం రోటరీ సభ్యులలో ఉన్న అంకిత భావాన్ని వ్యక్తమవుతుందని డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, కార్యదర్శి సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి, పి డి జి డాక్టర్ ఎస్ వి ఎస్ రావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ తాళ్లూరి శ్రీనివాస రాజు, డాక్టర్ నయన శ్రీరామ్ రావుల, నల్లమిల్లి మాచారెడ్డి, చిరంజీవి రెడ్డి, టేకుమూడి సూర్యనారాయణ, మాజేటి పవన్, లంక సాయిబాబు, డాక్టర్ మొండి రవికుమార్, నరహరిశెట్టి రవి కృష్ణ, సత్తి వెంకటరెడ్డి, చందు, బల్ల సత్యపాల్, డాక్టర్ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల నివాళి

## - పూలే స్ఫూర్తితో అందరికీ విద్య, సామాజిక న్యాయం సాధించాలి

**కాకినాడ, (రాజధాని వార్తలు):** మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో అందరికీ విద్య, సామాజిక న్యాయం సాధించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్‌లో పూలే విగ్రహానికి అంబేడ్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, జిజిహెచ్ ఎదురుగా ఉన్న విగ్రహానికి పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామేశ్వరరావు, సత్తిరాజు లతో పాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జీ, మాజీ జెడ్.పి.టి.సి సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు తదితరులు మాట్లాడుతూ బడుగుల జీవితాల్లో అక్షర వెలుగులు నింపిన జ్యోతి మహాత్మా పూలే అని కొనియాడారు. కుల వివక్షత, అంటరాని తనంపై పోరాడిన పూలే దేశంలో తొలి సామాజిక విప్లవకారు డన్నారు. తన భార్య సావిత్రిబాయికి చదువు నేర్పి తన ద్వారా బాలికల విద్యావ్యాప్తికి విశేషమైన కృషి చేశారన్నారు. 1874లో సత్యశోధక్ సమాజ్ స్థాపించి, యువతను అభ్యుదయ మార్గంలో నడిపించారన్నారు. 1882లో హంటర్ కమిషన్‌కు విద్య, రిజర్వేషన్‌లు



గురించి పూలే వినతి పత్రం సమర్పించారన్నారు. ప్రపంచ మేధావిగా పేరు గాంచిన అంబేద్కరే పూలేను తన గురువుగా భావించారన్నారు. పూలే స్ఫూర్తితో అందిరికీ విద్య, సామాజిక న్యాయం సాధనకై నేటి తరం ఉద్యమం సాగించాల న్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, కెవిపిఎస్ నాయకులు జి.సత్యానందం, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు చంద్రమళ్ళ పద్మ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు ఎస్ఎఫ్ఐ కార్యకర్త డి.ఆదర్శ్‌లతో పాటు టి.రాణి, డి.శారద, వెంకట్రావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో చట్టంపై అవగాహన సదస్సు





**కాకినాడ, (రాజధాని వార్తలు):** జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి సిహెచ్.లక్ష్మి ఆదేశాలు మేరకు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఆధ్వర్యంలో స్థానిక పి ఆర్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో ముఖ్య అతిధిగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుండి పిల్లలకు రక్షించడానికి భారత ప్రభుత్వం రూపొందించిన చట్టం అని తెలిపారు. ఈ చట్టం 18 సంవత్సరాలు లోపు పిల్లలందరిని లైంగిక వేధింపులు, లైంగిక దాడి మరియు లైంగిక దోపిడీ నుండి రక్షిస్తుందన్నారు. బాలలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడి, అశ్లీలత వంటి తీవ్రమైన నేరాలను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి ఈ చట్టాన్ని తీసుకు వచ్చారన్నారు. లైంగిక నేరాలను బట్టి ఈ చట్టం కింద కఠిన శిక్షలు ఉంటాయన్నారు. తీవ్ర మైన లైంగిక దాడి కేసులో దోషికి కనీసం 10 సంవత్సరాలు నుండి 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు మరియు జీవిత ఖైదు వరకు శిక్ష విధించవచ్చునని విద్యార్థులకు తెలియజేసారు. అంతేకాకుండా విద్యార్థులు ఆకతాయిల మాటలకు, ప్రలోభాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా ప్రేమ పేరుతో వేధించిన, బహుమతులు ఇచ్చిన తీసుకోరాదని ముఖ్యంగా ఆడపిల్లలు భద్రత వారు చేతుల్లోనే ఉందని తమను తాము రక్షించుకోవలసిన బాధ్యత కూడా వారిపై ఉందని అన్నారు. బాలలపై లైంగిక వేధింపులకు గురి చేసే వారిలో అత్యధికముగా బాలలతో పరిచయం ఉండి, వారికి నమ్మకమైన వ్యక్తి లేదా వారిపైన అధికారం చలయించగలిగే స్థానంలో ఉన్న వ్యక్తి మరియు వ్యక్తుల ద్వారానే బాలలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. సురక్షిత స్పర్శ మరియు అసురక్షిత స్పర్శ గురించి తెలియజేసారు. ఎవరైనా ముట్టు కోవడానికి ప్రయత్నిస్తే డోంట్ టచ్ (ముట్టు కోవద్దు) అని లేదా గట్టిగా కేకలు వేయమని, జన సమూహం ఉన్న ప్రదేశానికి పారిపోమని చెప్పారు. ఎవరైనా ప్రేమ పేరుతో వేధించిన లేదా లైంగిక వేధింపులకు గురిచేసిన, ప్రలోబాలకు పాల్పడిన, బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉన్న వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీస్ 112 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. చెప్పిన వారు వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

అదేవిదంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా మరియు హింసకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ తీసుకున్నారు. ఈ కార్యక్రమములో పి ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు చట్టాలు వాటి ప్రాము ఖ్యత తప్పక తెలుసుకోవాలన్నారు. ఆడపిల్లలు జాగ్రత్తలను పాటిస్తూ మిమల్ని మీరు రక్షించు కోవాలన్నారు. ప్రతీ ఒక్కరికి ఒక లక్ష్యం ఉండాలని ఆలక్ష్యంవైపు కృషి చేయాలి కానీ వ్యామో హాల వైపు కాదని అన్నారు. ఎవరైనా ఆకతాయిలు ప్రేమ పేరుతో వెంబడించిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫోన్ చేసి సమాచారము ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమములో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ యన్ వి లక్ష్మి, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఏ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎవ్లోనిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఘనంగా యండమూరులో "రైతన్న మీకోసం"








**కరప, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ బలోపేతం కోసం ఐదు కీలక చర్యలను అమలు చేస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కరప మండలం యండమూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మారెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన "రైతన్న మీకోసం"లో ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం నీటి భద్రత, డిమాండ్‌కు అనుగుణమైన పంటల సాగు, అగ్రిటెక్ ప్రోత్సాహం, ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధి, ప్రభుత్వ మద్దతు ధర వంటి విధానాలతో రైతుల ఆదాయాన్ని పెంచేందుకే కృషి చేస్తోందన్నారు. రైతు లకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ అవసరమైన సదుపాయాలు, మద్దతు ధర, ఆధునిక వ్యవసాయ పద్ధతులను చేరువ చేస్తున్నామని భరోసా ఇచ్చారు. కొత్త సాంకేతికత, యంత్రాల వినియోగం ద్వారా శ్రమ తగ్గి దిగుబడులు పెరుగుతాయని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్ర రావు, పెంకే శ్రీనివాస్ బాబా, నూరుకుర్తి వెంకటే శ్వరరావు, కడలి ఈశ్వరి, రంభాల వెంకటేశ్వరరావు తదితర రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి కూటమి నాయకులు, స్థానిక రైతులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# వృద్ధులకు బండారు ఫౌండేషన్ రగ్గులు పంపిణీ



**అల్లవరం, (రాజధాని వార్తలు):** బండారు రంగా ప్రసాద్ ఫౌండేషన్ నిరుపేద వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం అంబేద్కర్ నగర్‌లోని సామాజిక సేవా కార్యకర్త బండారు శ్రీదేవి జన్మదినం సందర్భంగా వృద్ధులకు రగ్గులు, బిస్కెట్స్, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఆమె జన్మదినం సందర్భంగా నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా కొమరగిరిపట్నంలో 100 మందికి రగ్గులు పంపిణీ చేశారు. బండారు రంగా ప్రసాద్ ఫౌండేషన్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు తన భర్త సత్య సహకారంతో నిర్వహిస్తున్నట్లు శ్రీదేవి తెలిపారు. శీతాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వారికి ఆమె సూచించారు. రగ్గులు పంపిణీ చేసిన శ్రీదేవికి వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త భూపతి ప్రతిభ, స్థానిక పెద్దలు యాళ్ల సోమరాజు, పొలమూరి చంద్రరావు, భూపతి భాస్కర రావు, ఇంజేటి గణపతి, భూపతి జేజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ




**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఎయిడ్స్ వ్యాధి, రోగుల పట్ల అవగాహన, ప్రేమ, సమానత్వం కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం దుర్గారావు దొర అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు అవగాహన కల్పించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ ద్వారా హృదయాన్ని తాకే, ప్రేరణాత్మక ప్రసంగాలు నినాదాలు చేశారు. సమాజానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని చేరవేయడానికి ఒకే మనసుతో ఒకే లక్ష్యంతో ఇక్కడ మనం ఉన్నామన్నారు. ఈ ర్యాలీ మనసును వెలిగించే కొవ్వొత్తులు మాత్రమే కాదనీ అవగాహన, ప్రేమ, సమానత్వం అనే విలువలను వెలిగించడంగా భావించాలన్నారు. ఎయిడ్స్ వల్ల మృతి చెందిన వేలాది మంది ఆత్మలకు నివాళిగా ఈ ర్యాలీ నిలుస్తుందన్నారు. హెచ్ఐవితో జీవిస్తున్న మన సోదరులు, సోదరీమణులకు మద్దతుగా నిలబడే బాధ్యత అందరూ అందరూ వహించాలన్నారు. మన చేతుల్లో ఉన్న ఈ చిన్న కొవ్వొత్తుల వెలుగు చీకటిని పారద్రోలి ఆశను నింపుతుందన్నారు. అదేవిధంగా అవగాహన, సహకారం, మన ప్రేమ సమాజంలో ఉన్న అజ్ఞానాన్ని, అని అపనమ్మకాలను, అపహాస్యాన్ని తొలగించే శక్తిని కలిగి ఉన్నాయన్నారు. హెచ్ఐవి అనేది ఒక వ్యాధి మాత్రమే కాదని హెచ్ఐవి ఉన్న మనుషులు మన కుటుంబ సభ్యులు, మన స్నేహితులు, మన సమాజంలో భాగమని వారిని దూరం పెట్టి వివక్షత చూపరాదని తోడుగా నిలబడటం మనబాధ్యత అన్నారు. వివక్షను తగ్గించి ఆవగాహనను పెంచుదామన్నారు. పరీక్షలు, చికిత్స, సలహా, సేవలు అందరికీ చేరేలా ప్రయత్నించాలన్నారు. యువతకు సురక్షిత జీవనశైలి గురించి తెలియజేయాలన్నారు. ఇచ్చేవి ఉన్నవారికి ప్రేమ, గౌరవం, అండ, ధైర్యం ఇవ్వాలని కోరారు. ప్రతి అడుగు ప్రతి దీపం ఒక కొత్త వెలుగును ప్రపంచానికి అందిస్తుందన్నారు. ఏకతాటిపై నిలబడి ఎయిడ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దామన్నారు. ముందుగా అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద పి ఎల్ హెచ్ఐవి కమ్యూనిటీ టార్గెట్ ఇన్ఫర్మేషన్ సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజే శారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్ వి భరత లక్ష్మి, వైద్యులు, సిబ్బంది, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ బుచ్చి బాబు, ఐసిటిసి ఎఆర్టి పేరెంట్ సపోర్ట్ టిఐఎన్జీవోస్ సిబ్బంది రాఘవేంద్రరావు, గంటా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త ఈఓగా రాపాక శ్రీనివాస్ బాధ్యతలు

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ప్రస్తుతం సర్పవరం శ్రీ భావ నారాయణస్వామి దేవాలయం కార్యనిర్వాహణాధికారిగా పని చేస్తున్న రాపాక శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతగా ఇంద్రపాలెం శ్రీ మందేశ్వర శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయాల ఈఓగా నియామకం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని, భక్తులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈవో కే నాగేశ్వరరావు, జీవోలు ఎన్ ఎన్ వీరభద్రరావు, ఆర్ రాజేశ్వరరావు, వి ఫణీంద్ర కుమార్, సోమరాజు, శివబాబు, వేణు, లక్ష్మణ్, శ్రీనివాస్, దేవాదాయ సిబ్బంది సిహెచ్ రాజు, ఎస్ రాజ్ కుమార్, కళ్యాణ్, లక్ష్మణ్, అనిల్, ఆలయ ప్రధాన అర్చకులు దత్తు, మధు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI No: APTEL/2015/66622, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan